1st Year Happy Work Anniversary.

షణ్ముఖ
SHANMUKHAVELUGU
# వెలుగు
ప్రతి వార్త వెలుగు వైపు
తెలుగు దినపత్రిక


RNI : APTEL / 2023 / 89152

Good for Health
Best for Readers
THE POWER OF RK PEN

సంపుటి : 2 సంచిక : 340 ఎడిటర్ & పబ్లిషర్ : ఓబులశెట్టి రాధాకృష్ణ దాస్ మంగళవారం 09 డిసెంబర్ 2025 పేజీలు 8 : వెల 3/-ఒంగోలు

VOLUME : 02 ISSUE : 340 EDITOR & PUBLISHER : OBULASETTY RADHAKRISHNA DASS PUBLISHED : ONGOLE Tuesday 09 December 2025 PAGES : 8 PRICE : 3/-

## వైకాపా పాలన దెబ్బతో..
# ఏపీ బ్రాండ్ దెబ్బతింది



(షణ్ముఖ వెలుగు, అమరావతి,డిసెంబర్ 08)

గతంలో ఐదేళ్లపాటు అభివృద్ధి ఆగిపోయిందని, ఆదాయం తగ్గిపోయిందని ఏపీ సీఎం చంద్రబాబు అన్నారు. ప్రస్తుతం ఓ వైపు రాష్ట్రాన్ని అభివృద్ధి బాటలో నడిపిస్తూ.. ప్రజలకు సంక్షేమ పథకాలు అందిస్తున్నామన్నారు. సచివాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. గత ప్రభుత్వం కేంద్ర పథకాల్లో అవకతవకలకు పాల్పడిందని, కేంద్ర నిధులను ఇతర పథకాలకు మళ్లించిందని అన్నారు.

" పునరుత్పాదక విద్యుత్ ఉత్పత్తి ప్రాజెక్టుల కోసం గతంలో రూ.9వేల కోట్లు ఖర్చు చేశారు. ఇప్పుడు విద్యుత్ ఛార్జీలు పెంచకుండానే విద్యుత్ రంగాన్ని సమర్థంగా నిలబెడుతున్నాం. వచ్చే ఏడాది కూడా విద్యుత్ రంగంలో సమర్థత పెంచుకుంటాం. వైకాపా పాలన దెబ్బకు ఆంధ్రప్రదేశ్ బ్రాండ్ దెబ్బతిన్నది. ఆ పార్టీ చేసిన దారుణాల వల్ల కొన్ని కంపెనీలు రాష్ట్రం నుంచి వెళ్లిపోయాయి. ఇప్పుడు అన్ని వ్యవస్థలను చక్కదిద్దుతూ అభివృద్ధి కొనసాగిస్తున్నాం. సాగు నీటి పంట గుంటలు తవ్వడంతోపాటు, చెక్ డ్యామ్‌లు కట్టాం. ఇంగ్లీష్ మీడియం పేరుతో విద్యా వ్యవస్థలో కూడా గతంలో డ్రామాలు చేశారు. విద్యా వ్యవస్థలోని బిల్లులు అన్నీ పెండింగ్‌లో పెట్టారు. వైకాపా ప్రభుత్వం 85 లక్షల టన్నుల చెత్తను వారసత్వంగా ఇచ్చి వెళ్లింది" అని చంద్రబాబు దుయ్యబట్టారు." ప్రతి త్రైమాసిక, ఆర్థిక ఏడాది రాష్ట్ర స్థూల ఉత్పత్తి పర్యవేక్షిస్తున్నాం. ప్రజల కోసం ఎంత కష్టమైనా సరే బాధ్యత తీసుకొని అభివృద్ధి చేస్తాం. ఆస్తులు, భవిష్యత్ ఆదాయాన్ని తాకట్టు పెట్టి గతంలో అప్పులు తెచ్చారు. మూలధన వ్యయం చేయకపోవడంతో గతంలో ప్రాజెక్టులు ముందుకెళ్లలేదు. కూటమి అధికారంలోకి వచ్చాకే స్వల్ప, మధ్య, దీర్ఘకాలిక ప్రాజెక్టులపై మూలధన వ్యయం పెంచి ప్రాజెక్టులు చేపట్టాం. వాట్సప్ గవర్నెన్స్ -మిగతా 2లో

## 'బంకిం దా కాదు.. బంకిం బాబు': ప్రధాని ప్రసంగానికి అడ్డుపడిన తృణమూల్ ఎంపీ



(షణ్ముఖ వెలుగు,ఢిల్లీ,డిసెంబర్ 08)


వందేమాతరం పై చర్చ సందర్భంగా పార్లమెంట్‌లో ప్రధాని మోదీ ప్రసంగిస్తుండగా ఓ ఆసక్తికర ఘటన చోటుచేసుకొంది. వందేమాతరం గేయ రచయిత బంకించంద్ర ఛటర్జీని ప్రధాని బంకిం దా (దాదా) అని పలుమార్లు సంబోధించారు. అదే సమయంలో తృణమూల్ ఎంపీ సౌగత్ రాయ్ ప్రధాని 'దా' అని సంబోధించడంపై అభ్యంతరం చెప్పారు. సోదరుడు అనే సంబోధించేందుకు బెంగాలీ భాషలో 'దా' అని వాడతారని.. సాంస్కృతిక దిగ్గజానికి అటువంటి పదం వాడటం సరికాదని పేర్కొన్నారు. 'బంకిం బాబు' అని ప్రధాని సంబోధించాలని సూచించారు. దీనికి సానుకూలంగా స్పందించిన ప్రధాని వెంటనే స్పందించారు. ఇకనుంచి బంకిం బాబు అనే సంబోధిస్తానని వెల్లడించారు. తన పొరబాటును సరిచేసినందుకు సౌగత్‌రాయ్‌కు ధన్యవాదాలు చెబుతూ.. "నేను మిమ్మల్ని దాదా అని సంబోధించవచ్చా..? లేదా దానిపై కూడా ఏమైనా అభ్యంతరాలున్నాయా..?" అని సరదాగా ప్రశ్నించారు.

**భారతీయుల శక్తిని తెలియజేసిన గేయం.. వందేమాతరం: మోదీ**

సోమవారం నాటి చర్చలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, ఎంపీ ప్రియాంక గాంధీ పాల్గొనలేదు. దీంతో ఎంపీ గౌరవ్ గొగొయ్ ప్రతిపక్షాల తరపున చర్చను ప్రారంభించారు. అయితే రాహుల్ గైర్హాజరు కావడాన్ని భాజపా నేత సీఆర్ కేశవన్ తప్పుపట్టారు.

## మన సంస్కృతిని ఎవరూ విచ్ఛిన్నం చేయలేరు

(షణ్ముఖ వెలుగు, అమరావతి,డిసెంబర్ 08)



దేశ సాంస్కృతిక వ్యవస్థను పాశ్చాత్య స్వార్థపూరిత సమూహంతో సహా ఎవరూ విచ్ఛిన్నం చేయలేరని ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ అన్నారు. 'కొందరు యూరోపియన్ల ఆలోచన ప్రక్రియలతో భారతీయులను బ్రెయిన్‌వాష్ చేసేందుకు ప్రయత్నిస్తుంటారు. అయినా మనం వారిని ప్రభావితం చేస్తాం. అది వేదజ్ఞానం, భగవద్గీతలతో పాతుకుపోయిన సనాతన ధర్మానికి ఉన్న శక్తి' అన్నారు. కర్ణాటక రాష్ట్రం ఉడుపి శ్రీకృష్ణ మఠంలో -మిగతా 2లో

## ఉక్రెయిన్ శాంతి చర్చలకు బ్రేక్.. జెలెన్‌స్కీపై ట్రంప్ అసంతృప్తి

**అమెరికా మధ్యవర్తిత్వంతో జరుగుతున్న ఉక్రెయిన్ శాంతి చర్చలకు విఘాతం**



(షణ్ముఖ వెలుగు,ఢిల్లీ,డిసెంబర్ 08)

ఉక్రెయిన్‌లో యుద్ధాన్ని ముగించేందుకు అమెరికా మధ్యవర్తిత్వంతో జరుగుతున్న శాంతి చర్చలకు తాత్కాలికంగా బ్రేక్ పడింది. అమెరికా ప్రతిపాదించిన శాంతి ప్రణాళికను ఉక్రెయిన్ అధ్యక్షుడు వొలొదిమిర్ జెలెన్‌స్కీ ఇంకా చదవలేదని, చర్చలను ముందుకు తీసుకెళ్లేందుకు ఆయన సిద్ధంగా లేరని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వ్యాఖ్యానించారు. -మిగతా 2లో

## ఏఎంసీలకు ఆర్థిక భరోసా కల్పించాలి

**ఛైర్మన్ల పదవీకాలాన్ని మూడేళ్లకు పెంచాలి**
**రాష్ట్రస్థాయి సదస్సులో పలు తీర్మానాలకు ఆమోదం**



(షణ్ముఖ వెలుగు, అమరావతి,డిసెంబర్ 08)

వైకాపా ప్రభుత్వం వ్యవసాయ మార్కెట్ కమిటీల(ఏఎంసీ)ను నిర్వీర్యం చేసిందని.. కూటమి ప్రభుత్వం ఆర్థిక భరోసా కల్పించి ఆదుకోవాలని ఏఎంసీ ఛైర్మన్లు కోరారు. 2014-19 మధ్య తెదేపా ప్రభుత్వంలో అమలైన విధానాలను పునరుద్ధరించాలన్నారు. జగన్ ప్రభుత్వం తెచ్చిన విధానాలను రద్దుచేయాలని విజ్ఞప్తి చేశారు. వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మన్ల అసోసియేషన్ ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి సదస్సు వ్యవసాయ మిషన్ వైస్‌ఛైర్మన్ మర్రెడ్డి శ్రీనివాసరెడ్డి అధ్యక్షతన ఆదివారం మంగళగిరిలో నిర్వహించారు. రాష్ట్రవ్యాప్తంగా తెదేపా, జనసేన, భాజపాలకు చెందిన ఏఎంసీ ఛైర్మన్లు ఇందులో పాల్గొన్నారు. పలు తీర్మానాలు ఆమోదించారు. -మిగతా 2లో

## తిరుపతి ఘటనపై హోంమంత్రి అనిత సీరియస్.. దర్యాప్తు కోసం ఒడిశాకు ప్రత్యేక బృందం

**తిరుపతి సంస్కృత వర్సిటీ ఘటనపై స్పందించిన హోంమంత్రి అనిత**

(షణ్ముఖ వెలుగు, అమరావతి,డిసెంబర్ 08)



తిరుపతిలోని రాష్ట్రీయ సంస్కృత విశ్వవిద్యాలయంలో విద్యార్థినిపై జరిగిన లైంగిక దాడి ఘటనపై రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనిత తీవ్రంగా స్పందించారు. ఈ కేసు దర్యాప్తు పురోగతిపై తిరుపతి ఎస్పీ, ఇతర పోలీసు ఉన్నతాధికారులతో ఆమె ఫోన్‌లో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. ఈ ఘటనలో నిందితులు ఎంతటివారైనా ఉపేక్షించేది లేదని, కఠిన చర్యలు తీసుకుంటామని ఆమె స్పష్టం చేశారు.ఫిర్యాదు అందిన వెంటనే పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారని హోంమంత్రి తెలిపారు. తిరుపతి ఎస్పీ స్వయంగా ఈ కేసును పర్యవేక్షిస్తున్నారని చెప్పారు. ప్రాథమిక దర్యాప్తులో భాగంగా సాక్ష్యాధారాలు, ఇతర కీలక సమాచారం సేకరించేందుకు ఒక ప్రత్యేక పోలీసు బృందాన్ని -మిగతా 2లో

## రాష్ట్రం.. స్పీడ్‌కు బ్రాండ్

**17 నెలల్లో రూ.20 లక్షల కోట్ల పెట్టుబడులు**
**20 లక్షల మందికి ఉపాధి కల్పిస్తాం**
**కష్టాల్లో మాకు ఎన్ఆర్ఐలు అండగా నిలిచారు**
**డాలస్ తెలుగు డయాస్పోరాలో మంత్రి లోకేశ్**

(షణ్ముఖ వెలుగు, అమరావతి,డిసెంబర్ 08)



'వేగానికి ఏపీ బ్రాండ్‌గా నిలుస్తోంది. యువతకు ఐదేళ్లలో 20 లక్షల ఉద్యోగాలు ఇవ్వాలన్నదే కూటమి ప్రభుత్వ లక్ష్యం. పెట్టుబడుల కోసం అన్ని దేశాలకూ వెళ్తున్నాం. 17 నెలల్లో రూ.20 లక్షల కోట్ల పెట్టుబడులు సాధించాం. వాటిద్వారా సుమారు 16 లక్షల మందికి ఉపాధి అవకాశాలు వస్తాయి. పెట్టుబడుల ఒప్పందాలను రాబోయే మూడు నెలల్లో గ్రౌండింగ్ చేస్తాం' అని రాష్ట్ర విద్య, ఐటీశాఖల మంత్రి నారా లోకేశ్ చెప్పారు. అమెరికా పర్యటనలో ఉన్న మంత్రి.. డాలస్‌లో నిర్వహించిన తెలుగు డయాస్పోరా సమావేశంలో పాల్గొన్నారు.

డాలస్‌లో తెలుగు డయాస్పోరాకు హాజరైన మంత్రి లోకేశ్‌తో కరచాలనం చేస్తున్న స్థానిక తెలుగు ప్రజలుఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 'చంద్రబాబును -మిగతా 2లో

## భారత విదేశాంగ మంత్రి జైశంకర్ పై నోరుపారేసుకున్న పాక్!

**భారత విదేశాంగ మంత్రి జైశంకర్ వ్యాఖ్యలపై పాక్ ఫైర్**



(షణ్ముఖ వెలుగు,ఢిల్లీ,డిసెంబర్ 08)

భారత విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్ చేసిన వ్యాఖ్యలపై పాకిస్థాన్ తీవ్రంగా స్పందించింది. తమ సైన్యంపై ఆయన చేసిన విమర్శలను తీవ్రంగా ఖండిస్తున్నట్లు ప్రకటించింది. భారత మంత్రి వ్యాఖ్యలు తమ దేశ వ్యవస్థలను, నాయకత్వాన్ని కించపరిచేలా ఉన్నాయని ఆరోపించింది. ఇటీవల -మిగతా 2లో

## సీఎం మార్పు ఊహాగానాల వేళ.. సీఎం సిద్ధూకు సుప్రీంకోర్టు నోటీసులు

(షణ్ముఖ వెలుగు,ఢిల్లీ,డిసెంబర్ 08)

కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్యకు సోమవారం సుప్రీంకోర్టు నోటీసులు ఇచ్చింది. 2023లో వరుణ అసెంబ్లీ నియోజకవర్గం నుంచి ఆయన ఎన్నికను సవాల్ చేస్తూ కె.శంకర అనే వ్యక్తి అత్యున్నత



న్యాయస్థానంలో పిటిషన్ వేశారు. దీనికి సమాధానం ఇవ్వాలని సీఎంను కోర్టు ఆదేశించింది. 1951 ప్రజాప్రాతినిధ్య చట్టంలోని నిబంధన ప్రకారం సిద్ధూ అవినీతి కార్యకలాపాలకు పాల్పడ్డారని, వరుణ అసెంబ్లీ నుంచి ఆయన ఎన్నిక చెల్లదని ప్రకటించాలని పిటిషనర్ కర్ణాటక హైకోర్టును ఆశ్రయించారు. అయితే ఆ అభ్యర్థనను కోర్టు తిరస్కరించింది. హైకోర్టు ఉత్తర్వులను పిటిషనర్ సుప్రీంలో సవాల్ చేయగా.. ధర్మాసనం నోటీసులు జారీ చేసింది. ఒకవైపు కర్ణాటకలో -మిగతా 2లో

## వైకాపా పాలన దెబ్బతో..
# ఏపీ బ్రాండ్ దెబ్బతింది

ద్వారా ప్రజల చేతుల్లోకి పాలన తీసుకెళ్లాం. వైకాపా హయాంలో పీపీఏల రద్దుతో విద్యుత్ వాడకుండానే రూ.9 వేల కోట్లు వ్యయం చేశారు. కక్షపూరిత రాజకీయాలతో గత పాలకు ప్రజాధనాన్ని వృథా చేశారు. 2014-19 మధ్య 13.5 శాతంగా వృద్ధిరేటు ఉండేది. 2019-24 మధ్య కాలంలో అది 10.32 శాతానికి పడిపోయింది. విద్యా వ్యవస్థను గాడిలో పెట్టేందుకు సంస్కరణలు తెచ్చాం. పల్లె పండుగ ద్వారా గ్రామాల్లో మౌలిక సౌకర్యాలు కల్పిస్తున్నాం" అని చంద్రబాబు తెలిపారు.

## రాష్ట్రం.. స్పీడ్‌కు బ్రాండ్

వైకాపా ప్రభుత్వం 53 రోజులు అక్రమంగా జైలులో ఉంచినప్పుడు ప్రవాసాంధ్రులు మద్దతుగా నిలిచారు. మాకు అండగా నిలిచిన వారిని గుండెల్లో పెట్టుకుని చూసుకుంటాం' అని అన్నారు. 'చదువుకుని మంచి ఉద్యోగాల కోసం మీరు ఇంత దూరం వచ్చారు. కేవలం జాబ్ సీకర్స్‌గా మాత్రమే కాకుండా.. జాబ్ క్రియేటర్స్‌గా తయారుకావాలి. రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ మీకు అండగా ఉంటుంది' అని లోకేశ్ అన్నారు. విదేశాల్లో చదువుకోవాలనుకునే వారికి వచ్చే ఏడాది నుంచి 'కలలకు రెక్కలు' పేరుతో అండగా నిలుస్తామని చెప్పారు. 'తెలుగువారి ఆత్మగౌరవాన్ని ఎన్టీఆర్ దేశానికి చాటి చెప్పారు. అభివృద్ధి చేసి ఎన్నికల్లో విజయం సాధించవచ్చని చంద్రబాబు నిరూపించారు. చంద్రబాబు దార్శనిక నాయకుడు. గతంలో ఐటీ.. ఇప్పుడు క్వాంటమ్ టెక్నాలజీని అందిపుచ్చుకునే ప్రయత్నం చేస్తున్నారు. ఆయన స్పీడ్‌ను ఇప్పటికీ అందుకోలేకపోతున్నా' అని చెప్పారు. 'ఏపీలో డబుల్ ఇంజిన్ బుల్లెట్ ట్రైన్ ప్రభుత్వం ఉంది. ఒకే రాష్ట్రం.. ఒకే రాజధాని.. అభివృద్ధి వికేంద్రీకరణ మా నినాదం. అన్ని ప్రాంతాలనూ సమగ్రాభివృద్ధి చేస్తున్నాం. గుజరాత్, ఒడిశాలలో కొన్నేళ్లుగా ఒకే ప్రభుత్వం ఉండటం వల్ల అభివృద్ధి సాధ్యమైంది. అలాగే ఏపీలోనూ ప్రభుత్వం కొనసాగింపు అవసరం. కలిసికట్టుగా పనిచేస్తామని ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ పదేపదే చెప్పారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం 15 ఏళు అధికారంలో ఉంటుంది' అని పేర్కొన్నారు.

## ఉక్రెయిన్ శాంతి చర్చలకు బ్రేక్..
## జెలెన్‌స్కీపై ట్రంప్ అసంతృప్తి

ఫ్లోరిడాలో మూడు రోజుల పాటు అమెరికా, ఉక్రెయిన్ అధికారుల మధ్య చర్చలు ముగిసిన తర్వాత ట్రంప్ ఈ వ్యాఖ్యలు చేశారు. కెన్నెడీ సెంటర్ ఆనర్స్‌కు హాజరయ్యే ముందు ఆయన మీడియాతో మాట్లాడుతూ.. "అధ్యక్షుడు జెలెన్‌స్కీ ఇంకా ప్రతిపాదనను చదవలేదని తెలిసి నేను కాస్త నిరాశ చెందాను. ఉక్రెయిన్ అధికారులు దీన్ని ఇష్టపడుతున్నారు. కానీ, ఆయన మాత్రం సిద్ధంగా లేరు" అని అన్నారు. రష్యా ఈ ప్రతిపాదనకు అనుకూలంగానే ఉందని తాను భావిస్తున్నట్లు ట్రంప్ తెలిపారు. ఈ విషయంపై జెలెన్‌స్కీ స్పందించారు. చర్చల్లో పాల్గొన్న అమెరికా అధికారులతో తాను ఫోన్‌లో మాట్లాడానని, పూర్తి వివరాలు తెలుసుకున్నానని వెల్లడించారు. "శాంతిని సాధించడానికి అమెరికాతో కలిసి చిత్తశుద్ధితో పనిచేయడానికి ఉక్రెయిన్ కట్టుబడి ఉంది" అని ఆయన సోషల్ మీడియాలో పేర్కొన్నారు. అయితే, శాంతికి మార్గం చాలా సంక్లిష్టంగా ఉందని ఆయన అభిప్రాయపడ్డారు.

### మొదటిపేజీ తరువాయి

మరోవైపు ఈ ప్రతిపాదనను రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ అధికారికంగా ఆమోదించలేదు. గత వారం ఆయన మాట్లాడుతూ, ఈ ప్రణాళికలోని కొన్ని అంశాలు ఆచరణ సాధ్యం కావని అన్నారు. కానీ, అమెరికా కొత్త జాతీయ భద్రతా వ్యూహాన్ని క్రెమ్లిన్ స్వాగతించింది. చర్చల ద్వారా సమస్యల పరిష్కారానికి మొగ్గు చూపడాన్ని తాము స్వాగతిస్తున్నామని తెలిపింది. ఈ రాజకీయ చర్చలు ఒకవైపు జరుగుతున్నప్పటికీ, ఉక్రెయిన్‌పై రష్యా దాడులు మాత్రం ఆగలేదు. వారాంతంలో జరిగిన దాడుల్లో నలుగురు మృతి చెందారు. నిన్న ఒక్కరోజే ఖార్కివ్ ప్రాంతంలో జరిగిన షెల్లింగ్‌లో ముగ్గురు పౌరులు ప్రాణాలు కోల్పోగా, మరో 10 మంది గాయపడ్డారు.

## భారత విదేశాంగ మంత్రి జైశంకర్ పై నోరుపారేసుకున్న పాక్!

ఓ జాతీయ మీడియా సంస్థ నిర్వహించిన సదస్సులో జైశంకర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా పాకిస్థాన్, ఆ దేశ ఆర్మీ చీఫ్ ఆసిమ్ మునీర్‌పై ఆయనకు ప్రశ్న ఎదురైంది. దీనికి బదులిస్తూ, భారత్‌కు ఎదురవుతున్న అనేక సమస్యలకు పాక్ సైన్యమే కారణమని, దాని నిజస్వరూపం అందరికీ తెలుసని ఆయన వ్యాఖ్యానించారు. ఈ వ్యాఖ్యలపై పాక్ విదేశాంగ కార్యాలయ ప్రతినిధి తాహిర్ స్పందించారు. "భారత విదేశాంగ మంత్రి వ్యాఖ్యలను మేం ఖండిస్తున్నాం. మా దేశ సైన్యంతో సహా అన్ని వ్యవస్థలు జాతీయ భద్రతకు మూలస్తంభాలు. వాటిపై ఇలాంటి వ్యాఖ్యలు చేయడం సరికాదు" అని ఆయన పేర్కొన్నారు. తమకు పాక్ సైన్యంతోనే ఎక్కువ సమస్యలు వస్తున్నాయని భారత్ చెప్పడం సరికాదని ఆయన అన్నారు.

## తిరుపతి ఘటనపై హోంమంత్రి అనిత సీరియస్..
## దర్యాప్తు కోసం ఒడిశాకు ప్రత్యేక బృందం

ఒడిశాకు పంపినట్లు అనిత వెల్లడించారు. బాధితురాలికి న్యాయం చేయడమే ప్రభుత్వ ప్రథమ కర్తవ్యమని మంత్రి అనిత పునరుద్ఘాటించారు. మహిళల భద్రతకు తమ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తుందని, ఇలాంటి దారుణాలను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమని ఆమె హెచ్చరించారు. ఈ కేసు దర్యాప్తును వేగవంతం చేసి, బాధితురాలికి త్వరితగతిన న్యాయం జరిగేలా చూడాలని పోలీసు అధికారులను హోంమంత్రి ఆదేశించారు.

## ఏఎంసీలకు ఆర్థిక భరోసా కల్పించాలి

సంఘం అధ్యక్షుడిగా నంద్యాల ఏఎంసీ ఛైర్మన్ జి.హరిబాబును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నియమించి ఆరు నెలలు పూర్తయినా ఇంతవరకు అధికారాలు, అభివృద్ధి పనులకు నిధులు కేటాయించలేదని పలువురు ఏఎంసీ ఛైర్మన్లు ఈ సందర్భంగా వాపోయారు. "ఛైర్మన్లకు చెక్‌పవర్ ఇవ్వాలి. పదవీకాలం మూడేళ్లకు పెంచాలి. రాష్ట్రప్రభుత్వం వివిధ కార్పొరేషన్లను ఏ, బీ కేటగిరీలుగా విభజించింది. ఏఎంసీ ఛైర్మన్లను 'బీ' గ్రేడ్‌గా పరిగణించాలి. తిరుమల శ్రీవారి దర్శనానికి ఏఎంసీ ఛైర్మన్లకు వారానికి కనీసం ఒక సిఫార్సు లేఖ ఇచ్చే అవకాశం ఇవ్వాలి. ఉల్లి, మిర్చి, మొక్కజొన్న తదితర పంట ఉత్పత్తులను ఆరబెట్టుకోడానికి, నిల్వ చేసుకోవడానికి ప్లాట్‌ఫాంలు, గోదాములు నిర్మించాలి. యార్డుల పరిధిలోని గ్రామాల్లో వ్యవసాయ ఉత్పత్తులు, ఎరువుల రవాణాకు అనుసంధాన రహదారులు, డొంక రోడ్లను అభివృద్ధి చేయాలి" అని ప్రభుత్వాన్ని కోరారు.

జగన్ నిర్వీర్యం చేసిన వ్యవసాయ రంగాన్ని పునరుద్ధరించడానికి, రైతులకు మేలు చేసేందుకు సీఎం చంద్రబాబు పంచసూత్రాలను ప్రవేశపెట్టారని మర్రెడ్డి శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఏఎంసీ ఛైర్మన్ అనేది పదవి కాదని.. బాధ్యతని గుర్తుచేశారు. గ్రామాల్లో ప్రకృతి వ్యవసాయం చేసేలా రైతుల్ని ప్రోత్సహించాలని ఆయన సూచించారు.

## సీఎం మార్పు ఊహాగానాల వేళ..
## సీఎం సిద్ధూకు సుప్రీంకోర్టు నోటీసులు

సీఎం మార్పుపై ఊహాగానాలు తీవ్ర స్థాయిలో చక్కర్లు కొడుతున్నాయి. సిద్ధూ స్థానంలో ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ సీఎం పీఠం మీద కూర్చుంటారనే వార్తలు ఆగడం లేదు. ఈ నేపథ్యంలోనే సిద్ధూకు నోటీసులు వచ్చాయి. మరోవైపు ఇప్పటికే నేషనల్ హెరాల్డ్ కేసులో డీకే శివకుమార్‌కు ఈవోడబ్ల్యూ నోటీసులు జారీ చేసింది. ఆర్థిక విషయాలు, లావాదేవీలపై శివకుమార్ వివరణ కోరుతూ ఆర్థిక నేరాల విభాగం పోలీసులు నోటీసులు ఇచ్చారు. ఈ నెల 19లోపు వివరాలు సమర్పించాలని ఈవోడబ్ల్యూ అధికారులు పేర్కొన్నారు. ఈ కేసుకు సంబంధించి ఇటీవలే కాంగ్రెస్ అగ్రనేతలు సోనియా గాంధీ, రాహుల్ గాంధీపై ఢిల్లీ పోలీసులు కొత్త ఎఫ్ఐఆర్ నమోదు చేసిన సంగతి తెలిసిందే.

## మన సంస్కృతిని ఎవరూ విచ్ఛిన్నం చేయలేరు

నెలరోజులుగా జరుగుతున్న లక్షకంఠ గీతాగాన కార్యక్రమం ముగింపు వేడుకల్లో ఆదివారం ఆయన పాల్గొని మాట్లాడారు. మంగళూరు వరకు ప్రత్యేక విమానంలో వచ్చిన ఆయన.. అక్కడి నుంచి రహదారి మార్గంలో ఇక్కడికి చేరుకున్నారు. ఏపీ ఉప ముఖ్యమంత్రికి ఆలయ అధికారులు, అర్చకులు పూర్ణకుంభాలతో మఠంలోకి స్వాగతం పలికారు.

అనంతరం ఆయన కనకన కిండి నుంచి కృష్ణుడిని దర్శించుకున్నారు. నవగ్రహ కిండి నుంచి మరో దర్శనం చేసుకున్నారు. ఈ వేడుకల్లో పాల్గొనడం తన పూర్వజన్మ సుకృతమని, ఉడుపిలోని దైవికశక్తే తనను ఇక్కడికి పిలిపించుకుందన్నారు. తాను నిష్కామ కర్మను అనుసరిస్తానని, గీత స్ఫూర్తితో స్థైర్యాన్ని పొందుతానని పవన్‌కల్యాణ్ తెలిపారు. తనకు ప్రతి శ్లోకానికీ అర్థం తెలియకపోయినా, గీతే తన జీవితాన్ని నడిపిస్తుందని దృఢంగా విశ్వసిస్తానని చెప్పారు. ఎన్నికలు తనను ప్రభావితం చేయవని, తన పోరాటం సత్యశక్తితో కొనసాగుతుందని తెలిపారు. నేటితరం యువత ఓదార్పు, ఆత్మవిశ్వాసం కోసం భగవద్గీతను దగ్గర ఉంచుకోవాలని పిలుపునిచ్చారు. భారతదేశానికి ఉడుపి ఆధ్యాత్మిక శక్తి కేంద్రమని అభివర్ణించారు. మధ్వాచార్యుడు, కనకదాసుల భక్తి సంపద.. కులాన్ని కూడా అధిగమిస్తుందని పేర్కొన్నారు. గీత ప్రపంచాన్ని తీర్చిదిద్దిన ఒక తత్వమని అభిప్రాయపడ్డారు. గీతను చేతితో రాసిన కోటిమందిని పవన్ అభినందించారు. గో సంరక్షణ భారతీయ సంప్రదాయంలో భాగమని, తాను 60 ఆవులతో గోశాలను నిర్వహిస్తున్నానని చెప్పారు. ద్వేషం లేకుండా సంస్కృతి కోసం స్వరాన్ని పెంచాలని తన విశ్వాసం నేర్పుతోందని తెలిపారు. ఇతరులు మన ధర్మం మీద దాడులు చేస్తున్నారనడం కంటే ముందు మన ధర్మాన్ని మనం పరిరక్షించుకోవాలి, ఇతరులు మనపై దాడిచేయకుండా గళమెత్తాలన్నారు. తమిళనాడులో మన ధర్మాన్ని మనం అనుసరించడం కోసం అక్కడివారు న్యాయపోరాటాలు చేయాల్సి వస్తోందని తెలిపారు. ఏపీలో ఎన్నికలకు ముందు కురుక్షేత్రంలో అర్జునుడిలాగే తనలోనూ చాలా సందేహాలొచ్చాయని, అప్పుడు భగవద్గీతను స్మరించుకుని, రాష్ట్ర ప్రయోజనాలే ముఖ్యమని భావించి.. 21 స్థానాల్లోనే పోటీ చేసినట్లు చెప్పారు.

# దళిత మహిళ పై దాడి చేసిన వారిని అరెస్టు చేయాలి



(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, డిసెంబర్ 8)

ఒంగోలు నగరం నెహ్రూ కాలనీకి చెందిన దళిత మహిళ దార్ల మాధురి పై దాడి చేసిన దుండగులను అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం జిల్లా కమిటీ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. సోమవారం బాధిత మహిళ ఇంటికి వెళ్లి ఐద్వా బృందం పరామర్శించింది.

ఈ సందర్భంగా ఐద్వా జిల్లా కార్యదర్శి కంకణాల రమాదేవి మాట్లాడుతూ తను నివసిస్తున్న ప్రాంతంలో ఒక కుటుంబం వద్ద 20,000 అప్పు తీసుకుని నెలకు 2000 చొప్పున బాధ్యత మహిళ చెల్లిస్తూ ఉన్నదని తెలిపింది. ఇళ్లల్లో పనిచేసే పేద మహిళ అయినా ఆమె రెండు నెలలో సకాలంలో చెల్లించాల్సిన 2000 చెల్లించనందున డబ్బు ఇచ్చిన కుటుంబం బాధితురాలని వీధుల్లో ఈడ్చుకుంటూ వెళ్లి, దాడి చేయడం దుర్మార్గమని అన్నారు. ఒక దళిత మహిళను ఇతర కులాలకు చెందిన వారు దూషిస్తూ కట్టేసి కొట్టేటువంటి ప్రయత్నం చేయటం అమానుషమైన చర్యగా భావిస్తున్నామని అన్నారు. తక్షణమే బాదితురాలకు ప్రభుత్వం అండగా నిలవాలని దాడి చేసి అవమానపరిచి దూషించిన దుండగులను అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. పరామర్శించిన బృందంలో ఐద్వా నగర కార్యదర్శి జి ఆదిలక్ష్మి, నగర నాయకురాలు కె రాజేశ్వరి ఉన్నారు.

# విస్తృత పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయండి

(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, డిసెంబర్ 8)




కలెక్టరేట్‌లోని పిజిఆర్ఎస్ సమావేశ మందిరంలో ప్రకాశం జిల్లా కలెక్టర్ పి రాజా బాబు, జాయింట్ కలెక్టర్ ఆర్ గోపాల క్రిష, జిల్లా రెవెన్యూ అధికారి చిన ఓబులేసు, జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ టి వెంకటేశ్వర్లు చేతుల మీదుగా పల్స్ పోలియోకు సంబంధించిన గోడ పత్రికను ఆవిష్కరించారు. ఇందులో భాగంగా జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ టి వెంకటేశ్వర్లు అర్జీ దారులకు, అధికారులకు పల్స్ పోలియో గురించి వివరించారు. పల్స్ పోలియో కార్యక్రమం డిసెంబర్ 21వ తేది ఆదివారం జరుగుతుందని, అలాగే 22, 23వ తేదీలలో గృహ సందర్శనాల ద్వారా పల్స్ పోలియో చుక్కలు వేస్తారని తెలిపారు. పల్స్ పోలియో చుక్కలు అప్పుడే పుట్టిన బిడ్డ దగ్గర నుండి 5 సంవత్సరాల లోపు పిల్లలు అందరికి పోలియో చుక్కలు వేయించాలని తెలిపారు. జిల్లాలో ప్రతి ప్రాథమిక, పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్ర పరిధిలోని ప్రతి వార్డ్, గ్రామముల యందు ఆరోగ్య సిబ్బంది, ఉపాధ్యాయులు, అంగన్వాడి సిబ్బంది, వాలెంటీర్స్ ద్వారా పోలియో చుక్కలు అందించాలని తెలిపారు. ఇండియాను పోలియో రహిత దేశముగా గుర్తించారని, కానీ ప్రక్కనున్న పాకిస్తాన్, ఆఫ్ఘనిస్తాన్ లాంటి ఇతర దేశాలలో పోలియో కేసులు ఉన్నందువలన ముందుజాగ్రత్తగా నేషనల్ ఇమ్మునైజేషన్ డే లో బాగంగా పల్స్ పోలియో కార్యక్రమ్మాన్ని చేపట్టారని తెలిపారు. ఈ పల్స్ పోలియో కార్యక్రమము 1995వ సవత్సరం నుండి నిర్వహిస్తున్నారు అని తెలిపారు. ఈ పల్స్ పోలియో చుక్కలు రైల్వే స్టేషన్ ల యందు, బస్ స్టాండ్‌ల యందు, సంచార జాతులు ఆవాసాల యందు, ఇటుక బట్టీల యందు, బిల్డింగ్లు కట్టే ప్రదేశాలయందు పల్స్ పోలియో చుక్కలు వేస్తారని తెలిపారు. ఈ పల్స్ పోలియో చుక్కల వల్ల పోలియో వ్యాదిని నిర్మూలించాలని ప్రతి పిల్లవాడికి పోలియో చుక్కలు వేయాలని ప్రతి చోట పోలియో వాక్సిన్ అందరికి అందుబాటులో ఉంటుందని తెలిపారు. ప్రతిసారి రొండు చుక్కలు పోలియో ఫ్రీ నిరంతరముగా విజయం సాధించాలని తెలిపారు. భారత దేశం పోలియో రహిత దేశం కానీ కొన్ని దేశాలలో పోలియో ఇప్పటికి ఉంది మరియు మల్లి తిరిగి రావచ్చు, మీ పిల్లలకు రక్షణ కల్పించడంలో ఎలాంటి తప్పులు చేయవద్దని పోలియో మోతాదును ప్రతిసారి ఇవ్వండి అని పోలియో ఫ్రీ విజయం సాదించడంలో దేశానికి తోడ్పడండి అని తెలిపారు. జిల్లాలో అన్ని ప్రాదమిక ఆరోగ్య కేంద్రాలలో, పట్టణ ప్రాదమిక ఆరోగ్య కేంద్రాలలో పోలియో దినం జరుగుతుందని ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పోలియో రహిత దేశం గాను, రాష్టం గాను, జిల్లా గాను మరియు గ్రామం గాను ఉండాలని తెలిపారు. ఇంటేన్సిఫైడ్ పల్స్ పోలియో ఇమ్మునైజేషన్ కార్యక్రమం డిసెంబర్ 21 వ తేది 2025వ సవత్సరం జరుగుతుంది. ఈ పల్స్ పోలియో సమాచారం ఈ క్రింది టేబుల్ నందు ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో డిఐఓ డాక్టర్ కమలశ్రీ, జిల్లా ఆరోగ్య విస్తరణ, మీడియా అధికారి బెల్లం నరసింహారావు, సరోజిని, డి శ్రీనివాసరావు, శ్రేదేవి, పలువురు ఆరోగ్య సిబ్బంది పాల్గొని విజయవంతం చేసారు.



షణ్ముఖ వెలుగు
ప్రతి వార్త వెలుగు వైపు తెలుగు దినపత్రిక
ప్రకాశం

# క్విస్ కళాశాలలో ప్రారంభమైన స్మార్ట్ ఇండియా హ్యాకథాన్ - 2025 గ్రాండ్ ఫినాలే

**హ్యాకథాన్‌లో పోటీపడుతున్న 126 మంది విద్యార్థులు**
**12 రాష్ట్రాల నుంచి వచ్చిన 18 టీమ్‌లు**
**మడోసారి ఆతిథ్యం ఇస్తున్న క్విస్ కళాశాల**



(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, డిసెంబర్ 8)

కేంద్ర, ప్రభుత్వ విద్యా మంత్రిత్వ శాఖ ఇన్నోవేషన్ సెల్, అఖిల భారత సాంకేతిక విద్యామండలి (ఏఐసీటీఈ) జాతీయ స్థాయిలో నిర్వహిస్తున్న స్మార్ట్ ఇండియా హ్యాకథాన్ - 2025 ఒంగోలులోని క్విస్ ఇంజనీరింగ్ కళాశాలలో సోమవారం ఘనంగా ప్రారంభమైంది. 12 రాష్ట్రాల నుంచి 126 మంది ఈ హ్యాకథాన్ లో పాల్గొంటున్నారని క్విస్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ నిడమానూరి సూర్య కల్యాణ్ చక్రవర్తి, ఎగ్జిక్యూటివ్ వైస్ ఛైర్మన్ డాక్టర్ నిడమానూరి శ్రీ గాయత్రి దేవి తెలియజేశారు. దేశవ్యాప్తంగా 60 నోడల్ సెంటర్లు ఉండగా అందులో క్విస్ ఒకటిగా ఎంపికైంది. క్విస్ కళాశాల మూడోసారి ఈ హ్యాకథాన్ కి ఆతిథ్యం ఇస్తుంది. ఈ సందరరేగా స్థానిక కళాశాలలో ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. నెల్లూరు విక్రమ్ సింహపురి యూనివర్సిటీ ఉపకులపతి ప్రొఫెసర్ అల్లం శ్రీనివాసరావు ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు ఇలాంటి హ్యాకథాన్ లు నిర్వహించడం ఎంతో ఉపయోగకరం అని అన్నారు. ఉద్యోగాలు వెతుక్కునే పరిస్థితి కాకుండా, ఉద్యోగాలు ఇచ్చే స్థితికి విద్యార్థులు వెళ్లేందుకు ఇలాంటి కార్యక్రమాలు దోహదం చేస్తాయని అన్నారు. కేంద్ర ప్రభుత్వం చొరవ తీసుకుని ఇలాంటి హ్యాకథాన్ లు నిర్వహించడం వల్ల భారతదేశం కూడా ఎంతగానో ముందుకు వెళ్తుందని అభిప్రాయపడ్డారు. క్విస్ ఇంజనీరింగ్ కళాశాలలో ఇలాంటి కార్యక్రమం జరగడం ఆనందంగా ఉందని, ఇంజనీరింగ్ విద్యను అభివ ృద్ధి చేయడం పట్ల క్విస్ తీసుకున్న అదుతేమైన నిర?యాల వల్లే ఇలాంటి అదుతేమైన అవకాశాలు క్విస్ కళాశాలకు దక్కుతున్నాయని ఆయన అన్నారు. అనంతరం మాట్లాడిన శ్రీ నిడమానూరి ఎడ్యుకేషనల్ ఇన్ స్టిట్యూట్ వైస్ ప్రెసిడెంట్ బాచిన చెంచు ప్రసాద్... వికసిత్ భారత్ కార్యక్రమంలో భాగంగా కేంద్ర ప్రభుత్వం ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం దేశాభివ ృద్ధికి ఎంతగానో దోహదం చేస్తుందని అన్నారు. క్విస్ ఇంజనీరింగ్ కళాశాల (తరువాయి 4లో...)

# సమిష్టిగా సమన్వయంతో పని చేస్తే ఉత్తమ ఫలితాలు వస్తాయి

**రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయ స్వామి**

(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, డిసెంబర్ 8)



సమిష్టిగా సమన్వయంతో పని చేస్తే ఉత్తమ ఫలితాలు వస్తాయని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయ స్వామి చెప్పారు. బంగారు పథకాన్ని సాధించడం ద్వారా ఎర్రగొండపాలెం యాస్పిరేషనల్ బ్లాక్ సాధించిన విజయమే దీనికి నిదర్శనమని అన్నారు. ఈ విజయంలో భాగస్వాములైన ప్రభుత్వ సిబ్బందికి అభినందన కార్యక్రమాన్ని జిల్లా ప్రణాళిక విభాగం ఆధ్వర్యంలో సోమవారం ఒంగోలు ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి ఆడిటోరియంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా మంత్రి పాల్గొన్నారు. మంత్రితోపాటు జిల్లా కలెక్టర్ పి రాజా బాబు, ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్ధనరావు, ఎర్రగొండపాలెం నియోజకవర్గ టిడిపి ఇన్చార్జ్ గూడూరి ఎరిక్షన్ బాబు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఎర్రగొండపాలెం మండల అధికారులు, క్షేత్రస్థాయి సిబ్బంది పనితీరు జిల్లా మొత్తానికీ స్ఫూర్తిదాయకంగా నిలిచిందన్నారు. వీరి అనుభవాలతో జిల్లా మొత్తాన్నీ ఇదేవిధంగా అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఈ దిశగా ప్రణాళికలు రూపొందించాలని అధికారులకు ఆయన దిశానిర్దేశం చేశారు. కలెక్టర్ మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో జరుగుతున్న పురోగతిని ఉన్నత స్థాయి నుంచి నిరంతరం పర్యవేక్షించడం ద్వారా ఈ విజయం లభించిందన్నారు. ఇలాంటి అభివృద్ధిని ముందుకు తీసుకువెళ్లేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పథకాలను సమ్మిళితం చేస్తూ ప్రతి రెవిన్యూ డివిజన్లోనూ ఒక గ్రామాన్ని పైలెట్ ప్రాజెక్టుగా తీసుకుని అమలు చేస్తున్నామన్నారు. ఒంగోలు ఎమ్మెల్యే మాట్లాడుతూ ఉత్తమ పనితీరుకు ఎల్లప్పుడూ గుర్తింపు లభిస్తుందన్నారు. అలాంటి వారికి ప్రభుత్వం ఎల్లవేళలా అండగా నిలుస్తుంది అని చెప్పారు. అందుకే మండల స్థాయిలో కాకుండా జిల్లా స్థాయిలో ఈ అభినందన కార్యక్రమాన్ని ఏర్పాటు చేసామన్నారు. విజేతలకు ఈ సందర్భంగా ఆయన అభినందనలు తెలిపారు. గూడూరి ఎరిక్షన్ బాబు మాట్లాడుతూ ప్రజలకు మెరుగైన విద్య, వైద్య సదుపాయాలను కల్పించడంతోపాటు మౌలిక వసతులు అందుబాటులోకి తేవడం ద్వారా సమగ్ర అభివృద్ధి సాధనకు ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టిందన్నారు. అదే స్ఫూర్తితో అధికారులు, సిబ్బంది కూడా పనిచేయటం ద్వారా ఎర్రగొండపాలెం మండలానికి ఈ గుర్తింపు లభించింది అన్నారు. ఆయా విభాగాలలో కేంద్ర ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలు చేరుకునేలా పర్యవేక్షించిన జిల్లాస్థాయి అధికారులను మంత్రి, కలెక్టర్, ఎమ్మెల్యే ఈ సందర్భంగా సత్కరించారు. ముందుగా ఆయా శాఖల వారీగా ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను వీరు సందర్శించి (తరువాయి 4లో...)



# 17న కోటి సంతకాలను గవర్నర్‌కి అందిస్తాం

**వైసిపి రీజనల్ కోఆర్డినేటర్ కారుముడి వెంకట నాగేశ్వరరావు**

(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, డిసెంబర్ 8)

ఈ నెల 17న వైసిపి శ్రేణులు రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ మెడికల్ కళాశాలలో ప్రైవేటు భాగస్వామ్యాన్ని వ్యతిరేకిస్తూ సేకరించిన కోటి సంతకాలను మాజీ ముఖ్యమంత్రి జగన్ ఆధ్వర్యంలో గవర్నర్‌కి అందజేయడం జరుగుతుందని వైసిపి రీజనల్ కోఆర్డినేటర్ కారుమూరి వెంకట నాగేశ్వరరావు పేర్కొన్నారు. వైసీపీ జిల్లా కార్యాలయంలో సోమవారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈనెల 10వ తేదీన జిల్లాలో అన్ని నియోజకవర్గాల పరిధిలో సేకరించిన కోటి సంతకాలను జిల్లా కేంద్రానికి చేర్చాలని పేర్కొన్నారు. అలాగే 15వ తేదీన కలెక్టర్ కార్యాలయం వద్ద ఉన్న వై.యస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహం వరకు భారీ ర్యాలీ నిర్వహించి అక్కడి నుండి జిల్లా నలుమూలల నుండి వచ్చిన కోటి సంతకాల వ్యానులు జెండా ఊపి తాడేపల్లి పంపించడం జరుగుతుందన్నారు. 17వ తేదీన జగన్ గవర్నర్ ని కలిసి కోటి సంతకాలను అందజేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమాలలో కార్యకర్తలు విలువగా పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలో వైయస్ రాజశేఖర్ రెడ్డి ప్రవేశపెట్టిన ఆరోగ్య శ్రీ పథకాన్ని కూటమి ప్రభుత్వం నీరు కాలుస్తుందన్నారు. పేదలను ప్రభుత్వ వైద్యానికి దూరం చేస్తుందన్నారు. ప్రభుత్వ ఆధ్వర్యంలో మెడికల్ కళాశాలలు ఉంటే అన్ని రకాల వైద్యాలు పేదలకు అందుబాటులో ఉంటాయన్నారు. పరకామణి కేసును కోర్టులలో పరిష్కరించబడిందన్నారు. దొంగతనం చేసిన బ్రాహ్మణ కుటుంబం స్వామివారికి రూ.14 కోట్లు విలువైన ఆస్తులను రాసి ఇచ్చారన్నారు. తీర్పు చెప్పిన జడ్జిని స్వయంగా స్పందించి ఆస్తుల రిజిస్ట్రేషన్ కయ్యే రూ.50 లక్షలను స్వయంగా భరించారన్నారు. కోర్టుల ద్వారా పరిష్కారమైన కేసును కూటమి ప్రభుత్వం ఎందుకు రాజకీయం చేస్తుందో తెలియటం లేదన్నారు. ఈ సమావేశంలో వైసీపీ జిల్లా అధ్యక్షులు, దర్శి ఎమ్మెల్యే డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, జిల్లా పరిషత్ చైర్ పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, ఒంగోలు పార్లమెంటు నియోజకవర్గం పరిశీలకులు బత్తుల బ్రహ్మానందరెడ్డి, ఎర్రగొండపాలెం ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్, (తరువాయి 4లో...)

# బిపిఎస్ స్కీమును సద్వినియోగం చేసుకోండి

**2026 మార్చి తర్వాత అక్రమ నిర్మాణల తొలగింపు షురూ...!**
**ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్థన్‌రావు**

(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, డిసెంబర్ 8)



చాలా సంవత్సరాల తర్వాత రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన బిపిఎస్ స్కీమును గృహ నిర్మాణదారులు సద్వినియోగం చేసుకోవాలని ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్థన్‌రావు కోరారు. సోమవారం రాత్రి నగరంలోని ఎమ్మెల్యే దామచర్ల జనార్థన్‌రావు నివాసంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. చాలా సంవత్సరాల తర్వాత ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం బిపిఎస్ స్కీమును ప్రకటించిందన్నారు. ఈ స్కీము ద్వారా అనుమతులు లేకుండా, ప్లాను తీసుకొకుండా నిర్మించిన భవనాలు, ఆపార్టుమెంట్లు, ఇల్లు, డీవియేషన్‌తో కట్టిన నిర్మాణాలకు తగిన ఫీజు చెల్లించి క్రమబద్దీకరణ చేసుకునే అవకాశం కల్పించడం జరిగిందన్నారు. కావున 2026 మార్చి 11 వరకు మాత్రమే ఈ అవకాశం ఉంటుందన్నారు. అంతే కాకుండా ఇదే చిట్ట చివరి అవకాశమన్నారు. మళ్ళీ భవిషత్తులో ఇలాంటి అవకాశం ఉండదన్నారు. కావున ప్రతి ఒక్కరు ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని ఆయన కోరారు. ఒంగోలు నగరంలో లైసెన్సుడ్ ఇంజినీరు ద్వారా రూ.10 వేలు చెల్లించి అప్లై చేసుకోవచ్చని తెలిపారు. 1997 డిశంబర్ 31 తేదికి ముందు కట్టిన భవనాలకు 25% రాయితీ ఉంటుంది. స్లమ్స్ ఏరియాలోని భవనాలకు 50% రాయితీ కల్పించబడుతుందన్నారు. మార్చి 11, 2026 చివరి రోజు కాబట్టి ఆ తర్వాత బిపిఎస్ చేసుకోని ఇల్లు, భవనాలు, ఆపార్టుమెంట్, ఎక్స్‌ట్రా ఫ్లోర్‌లను కూల్చివేయటం జరుగుతుందని తెలిపారు. పూర్తి వివరాలకు ఒంగోలు నగరపాలక సంస్థలోని " ప్లానింగ్ సెక్షన్" లో సంప్రదించాలన్నారు. లేదా 08592-227766 నెంబర్‌కి ఫోన్ చేసి సంప్రందించాలని తెలిపారు. మెప్మాలో అవినీతి గురించి మాట్లాడుతూ ప్రస్తుతం విచారణ జరుగుతుందన్నారు. త్వరలో నివేదిక వస్తుందని, నివేదిక ఆధారంగా తప్పకుండా చర్యలు ఉంటాయి తెలిపారు. ఈ మీడియా సమావేశంలో కమీషనర్ వెంకటేశ్వరావు, టీడీపీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

# సమిష్టిగా సమన్వయంతో పని చేస్తే ఉత్తమ ఫలితాలు వస్తాయి










'సంపూర్ణత అభియాన్' కార్యక్రమాన్ని తెలియజేసేలా ఏర్పాటుచేసిన సెల్ఫీ పాయింటు వద్ద ఫోటోలు దిగారు.

**యాస్పిరేషనల్ బ్లాక్ అంటే... ?**

దేశంలో వెనుకబడిన మండలాలను (బ్లాక్స్), జిల్లాలను గుర్తించి వాటిని సమగ్రంగా అభివృద్ధి చేసేందుకు యాస్పిరేషనల్ బ్లాక్స్, యాస్పిరేషనల్ డిస్ట్రిక్ట్స్ పేరుతో కేంద్ర ప్రభుత్వం ప్రత్యేకంగా దృష్టి సారించింది. వివిధ శాఖలు సమన్వయంతో పని చేసి ఆయా ప్రాంతాలను అభివృద్ధి చేసేలా కొన్ని ప్రత్యేక ఇండికేటర్స్ ను నిర్దేశించింది. వీటి ఆధారంగా సాధించిన పురోగతిని పరిశీలించి వాటికి ర్యాంకులను కేటాయిస్తున్నది.

**రాష్ట్రంలోనే ఫస్ట్..!**

ఈ విధంగా రాష్ట్రంలో 15 మండలాలను (బ్లాక్స్) కేంద్ర ప్రభుత్వం గుర్తించింది. వాటిలో ప్రకాశం జిల్లాలోని ఎర్రగొండపాలెం మండలం కూడా ఉన్నది. ఈ మండలంలో 2023 ఏప్రిల్ ఒకటవ తేదీ నుంచి యాస్పిరేషనల్ బ్లాక్ ప్రోగ్రామ్ (ఏ.బీ.పీ) ప్రారంభమైంది. ఈ బ్లాక్ లోని ప్రజల ఆరోగ్య స్థితిగతులు, ముఖ్యంగా చిన్నారులు, గర్భిణుల ఆరోగ్య సంరక్షణ, భూసార పరీక్షలు నిర్వహించి సాయిల్ హెల్త్ కార్డులు జారీ చేయడం, స్వయం సహాయక సంఘాలలోని మహిళలకు లభిస్తున్న రివాల్వింగ్ ఫండ్ వంటి ఇండికేటర్స్‌ను ప్రామాణికంగా నిర్ధారించింది. ఈ విభాగాలలో అద్భుతమైన పురోగతి సాధించడం ద్వారా రాష్ట్రంలోనూ, కేంద్రస్థాయిలోనూ ఎర్రగొండపాలెం బ్లాక్ కు ప్రత్యేక గుర్తింపు లభించింది. కేంద్ర ప్రభుత్వం బంగారు పథకాన్ని అందించింది. ఈ కార్యక్రమంలో సిపిఓ సుధాకర్ రెడ్డి, డిఎంహెచ్వో వెంకటేశ్వర్లు, జిల్లా వ్యవసాయ అధికారి శ్రీనివాసరావు, జిల్లా సాంఘిక సంక్షేమ అధికారి లక్ష్మానాయక్, ఎస్సీ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అర్జున్ నాయక్, డిఆర్డిఏ ప్రాజెక్ట్ డైరెక్టర్ నారాయణ, ఐసిడిఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ సువర్ణ, ఎర్రగొండపాలెం ఎంపీడీవో (యాస్పిరేషనల్ బ్లాక్ నోడల్ ఆఫీసర్) శ్రీనివాసులు, ఇతర అధికారులు పాల్గొన్నారు. మండల స్థాయి సిబ్బంది అందరూ అతిథులు, ఉన్నతాధికారులతో గ్రూప్ ఫోటో దిగారు. ఈ కార్యక్రమంలో చిన్నారులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

## అనాధ బాలికలకు హెల్త్ కార్డులు





**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, డిసెంబర్ 8)**

ప్రకాశం జిల్లాలోని ఒంగోలు, గిద్దలూరులోని బాల సదన్‌లలో నమోదు చేసుకున్న అనాథ బాలికలకు అమృత హెల్త్ స్కీం ద్వారా ప్రైవేట్ ఎన్టీఆర్ వైద్యసేవ కలిగిన నెట్వర్క్ హాస్పిటల్స్ నందు ఉచితంగా వైద్యసేవలు పొందడానికి తగిన హెల్త్ కార్డులను సోమవారం ఉదయం ఒంగోలు కలెక్టరేట్‌లోని పిజిఆర్ఎస్ హాల్లో జిల్లా కలెక్టర్ రాజాబాబు చేతుల మీదుగా అందచేశారు. బాల సదన్ నిర్వాహకులు ఈ బాలికలలో ఏదయినా అనారోగ్య సమస్యలు గుర్తుంచినట్లయితే వెంటనే ప్రైవేట్ నెట్వర్క్ హాస్పిటల్స్ నందు చూపించి తగిన వైద్యం ఉచితంగా పొందవలసిందిగా జిల్లా కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్టీఆర్ వైద్యసేవ జిల్లా సమన్వయకర్త డాక్టర్ హేమంత్, ఐసిడిఎస్ పీ డీ సువర్ణ, డిస్ట్రిక్ట్ చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్ దినేష్ కుమార్, బాలసదన్ నిర్వాహకులు, బాలికలు, తదితరులు పాల్గొన్నారు.

## పేదలకు అండగా స్నేహహస్తం ట్రస్ట్ కనిగిరి ప్రభుత్వాసుపత్రిలో భోజన వసతి




**(షణ్ముఖ వెలుగు, కనిగిరి టౌన్, డిసెంబర్ 8)**

కనిగిరి ప్రభుత్వ ఆసుపత్రిలో సోమవారం స్నేహహస్తం చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో రోగులు, వారి బంధువులు, పేదవారికి ఉచిత భోజన వసతి కల్పించారు. ట్రస్ట్ సభ్యులు స్వయంగా భోజనం పంపిణీ చేస్తూ, ప్రేమ-పరమార్ధంతో ఆదుకోవాలనే సంకల్పాన్ని వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ కన్వీనర్ సుధీర్ బాబు మాట్లాడుతూ, "పేదవారికి ఆహారం సమకూర్చడం చాలా ఆనందం అనిపిస్తోంది. మానవసేవే మాధవసేవ అన్న భావనతో మనం చేసిన చిన్న సహాయం కూడా ఎన్నో కుటుంబాల్లో ఆశ నింపగలదు. ఈ ప్రయత్నం నిరంతరంగా కొనసాగుతూ మరెందరికో ఉపశమనం కలిగించాలని కోరుకుంటున్నాం" అని అన్నారు. ఆసుపత్రిలో చేరిన అనేక మంది రోగులు, వారి బంధువులు, అలాగే ఆహార వసతి లేక ఇబ్బందిపడే పేదవారు ఈ సేవలతో ఆనందం వ్యక్తం చేశారు. స్థానికులు ట్రస్ట్ చర్యను ప్రశంసిస్తూ, ఇలాంటి సేవా కార్యక్రమాలు సమాజంలో మానవత్వాన్ని నిలబెడతాయని వ్యాఖ్యానించారు. ట్రస్ట్ సభ్యులు ఈ సందర్భంగా భవిష్యత్తులోనూ పేదలకు భోజన వసతి, వైద్య సహాయం, విద్యారంగంలోనూ సాయము అందించేందుకు కృషి చేస్తామని తెలిపారు. ప్రభుత్వ వైద్యశాల సిబ్బంది, స్నేహహస్తం సభ్యులు గౌస్, కాసింపీరా, కిషోర్ బాబు, మెర్లిన్, తదితరులు పాల్గొన్నారు.

## క్విస్ కళాశాలలో ప్రారంభమైన స్మార్ట్ ఇండియా హ్యాకథాన్ - 2025 గ్రాండ్ ఫినాలే




మూడోసారి ఇలాంటి కార్యక్రమం నిర్వహించడం ఎంతో గర్వకారణం అని అన్నారు. తమ కళాశాలలో కూడా విద్యార్థులు అదుతేమైన ప్రాజెక్ట్ లు చేస్తున్నారని అన్నారు. స్మార్ట్ ఇండియా హ్యాకథాన్ అనేది విద్యార్థులకు ఎంతగానో ఉపయోగపడుతుందని ఆయన చెప్పారు. అనంతరం ఏఐసీటీఈ ఛైర్మన్ ప్రొఫెసర్ టీజీ సీతారామ్ స్మార్ట్ ఇండియా హ్యాకథాన్ ని వర్చువల్ గా ప్రారంభించి మాట్లాడారు. ఈ కార్యక్రమాన్ని ఏఐసీటీఈ నోడల్ సెంటర్ ఇంఛార్జ్ డాక్టర్ శృతి భార్గవ ఛౌబే, టీసీఎస్ సీనియర్ కన్సల్టెంట్ ప్రతాప్ కొల్లా పర్యవేక్షించారు.

**12 రాష్ట్రాల నుంచి 126 మంది పోటీదారులు**

స్టార్మ్ ఇండియా హ్యాకథాన్ 2025 గ్రాండ్ ఫినాలె లో క్విస్ నోడల్ సెంటర్ కి నాలుగు ప్రాబ్లమ్ స్టేట్ మెంట్స్ ఇచ్చినట్లు కన్వీనర్ డాక్టర్ డి బుజ్జిబాబు తెలియజేశారు. ఇండియన్ హెరిటేజ్ అండ్ కల్చర్, మెడ్, హెల్త్, బయోటెక్, స్టూడెంట్ ఇన్నోవేషన్ ఆన్ మిస్ లీనియస్, ఎనర్జీ రెన్యూవల్ అండ్ కన్జర్వేటివ్ సిస్టమ్, సస్టైనబులిటి అంశాలపై 126 మంది పోటీ పడుతున్నట్లు తెలియజేశారు. 12 రాష్ట్రాల విద్యార్థులకు క్విస్ కళాశాల ఆతిథ్యం ఇచ్చినట్లు చెప్పారు. వాళ్లంతా 36 గంటల పాటు పోటీలో పాల్గొంటారని అన్నారు. వివిధ విభాగాలకు చెందిన 14 మంది జ్యూరీ సభ్యులుగా వ్యవహరిస్తున్నారని అన్నారు. పోటీల్లో గెలపొందిన వారికి మంగళవారం జరిగే ముగింపు కార్యక్రమంలో బహుమతులు అందజజేస్తారని చెప్పారు. పోటీదారుల కోసం వివిధ సాంస్క ృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేసినట్లు తెలియజేశారు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో క్విస్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వై.వి. హనుమంతరావు, డీపీఎస్ ఆర్ డైరెక్టర్ డాక్టర్ సుబ్బారావు, వివిధ విభాగాల డీన్ లు, హెచ్ వోడీలు, డైరెక్టర్లు పాల్గొన్నారు.

## 17న కోటి సంతకాలను గవర్నర్‌కి అందిస్తాం



మాజీ ఎమ్మెల్సీ, పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జూపూడి ప్రభాకర్, మాజీ మంత్రి మేరుగ నాగార్జున, ఆదిమూలపు సురేష్, మాజీ ఎమ్మెల్యే కదిరి బాబురావు, ఉడుముల శ్రీనివాసరెడ్డి, కసుకుర్తి ఆదెన్న, కనిగిరి నియోజకవర్గ ఇంచార్జ్ దద్దాల నారాయణ యాదవ్, ఒంగోలు నియోజకవర్గ ఇంచార్జ్ చుండూరి రవిబాబు, రాష్ట్ర కార్యదర్శులు కెవి రమణారెడ్డి, వై వెంకటేశ్వరరావు, బొట్ల రామారావు, తదితరులు పాల్గొన్నారు.

## స్మశాన వాటిక, వాగు పోరంబోకులలోని అక్రమణల తొలగింపు



**(షణ్ముఖ వెలుగు, చీమకుర్తి, డిసెంబర్ 8)**

చీమకుర్తి మున్సిపాలిటీ పరిధిలోని క్రిస్టియన్ పాలెం స్మశాన వాటికను ఆనుకొని ఉన్న వాగు పోరంబోకులలో ఉన్న ఆక్రమణలను సోమవారం మున్సిపల్ అధికారులు తొలగించారు. చీమకుర్తి క్రిస్టియన్ పాలెం నకు చెందిన స్మశానం కేటాయింపులో భాగంగా, పెరిగిన జనాభా దృష్ట్యా పూర్వం కేటాయించిన స్మశాన స్థలం సరిపోకపోవడంతో పక్కన ఆక్రమణలో ఉన్న వాగు పోరంబోకు భూమిలో ఆక్రమణలు తొలగించి స్మశాన వాటికకు సరిపోయేంత భాగాన్ని కలిపి కాంపౌండ్ వాల్ ఏర్పాటు చేసే ఆలోచనలో మున్సిపల్, రెవెన్యూ అధికారులు ఉన్నారు. చీమకుర్తి మున్సిపాలిటీ పరిధిలో ఉన్న సమస్యలలో, సార్వత్రిక ఎన్నికల హామీలలో చీమకుర్తి క్రిస్టియన్‌పాలెం స్మశాన వాటిక సమస్య కూడా ఉండటంతో కూటమి ప్రభుత్వ నాయకులు, అధికారులు ఈ సమస్య పై ప్రత్యేక దృష్టి సారించి ఆక్రమణలు తొలగించి చర్యలు చేపట్టారు.

## మందుబాబులకు జరిమానా

**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, డిసెంబర్ 8)**

ప్రకాశం జిల్లా ఎస్పీహర్షవర్ధన్ రాజు ఉత్తర్వుల మేరకు విజబుల్ పోలీసింగ్ , వాహన తనిఖీలలో భాగంగా ఒంగోలు ట్రాఫిక్ పోలీస్ వారు చెక్ చేస్తుండగా మద్యం సేవించి వాహనాలు నడుపుతూ పట్టుబడిన వారిలో ముగ్గురుని సోమవారం కోర్ట్ వారి వద్ద హాజరు పరచారు. ముగ్గురు వాహనదారులకు 2 రోజులు జైలు శిక్ష విధించారని ఒంగోలు ట్రాఫిక్ సీఐ జగదీష్ ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ ఎవరు కూడా మద్యం సేవించి వాహనాలు నడపరాదని, హెల్మెట్ లేకుండా, సీట్ బెల్ట్ ధరించకుండా వాహనాలు నడపరాదని, ట్రిపుల్ రైడింగ్ చేయరాదని, వాహనాలను అతి వేగంగా నడపరాదని, మైనర్ డ్రైవింగ్ చేయరాదని, వాహనదారులందరూ ఎంవీ యాక్ట్ రూల్స్ పాటించి సురక్షితంగా గమ్యం చేరుకోవాలని తెలిపారు.

# జూనియర్ కళాశాలలో అంగరంగ వైభవంగా ఫేర్వెల్ వేడుకలు












**(షణ్ముఖ వెలుగు, కందుకూరు, డిసెంబర్ 8)**

కందుకూరు పట్టణం లోని బి ఆర్ ఆక్స్‌ఫర్డ్ ఐఐటి, మెడికల్ అకాడమీ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ విద్యార్థుల ఫేర్వెల్ వేడుకలు సోమవారం ఘనంగా జరిగాయి. విద్యార్థినీ, విద్యార్థులు సాంప్రదాయ దుస్తులతో కళాశాల ప్రాంగణంలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు.న ృత్య ప్రదర్శనలు, సాంస్కృతిక కార్యక్రమాలతో అలరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న బి.ఆర్.ఆక్స్ ఫర్డ్ విధ్యాసంస్థల చైర్మన్ ఉన్నం భాస్కరరావు మాట్లాడుతూ విద్యార్థినీ,విద్యార్థులకు చక్కని విలువలతో కూడిన విద్య తో పాటు క్రమశిక్షణ, నైతిక విలువలు నేర్పుతూ మా విద్యాసంస్థలు అభివృద్ధి చెందడానికి ఎల్లవేళలా కృషి చేస్తున్న అధ్యాపక బ ృందానికి,ఆదరిస్తున్న తల్లిదండ్రులకు ధన్యవాదాలు తెలిపారు. భవిష్యత్తులో పేద, మధ్యతరగతి కుటుంబాల వారికి అనుగుణంగా చక్కటి విద్యను విద్యార్థులకు అందించడానికి,అలాగే జాతీయస్థాయిలో ఉత్తమ ర్యాంకులు సాధించడానికి ఎల్లవేళలా క ృషి చేస్తామని తెలిపారు. అలాగే విద్యాసంస్థల కరస్పాండెంట్ బండి వెంకటేశ్వర్లు, డైరెక్టర్స్ జి బాల భాస్కరరావు, బి నరేంద్రబాబులు వారి విలువైన సందేశాలను, సూచనలను విద్యార్థులకు చక్కగా తెలియజేశారు. అనంతరం ఉపాధ్యాయులను సన్మానించి, బహుమతులు అందజేశారు.అలాగే గత విద్యా సంవత్సరంలో చదివి జాతీయస్థాయిలో అడ్వాన్స్ మెయిన్స్ ర్యాంకులు సాధించి ఐఐటి ఎన్ఐటి లలో సీట్లు పొందిన విద్యార్థినీ, విద్యార్థులను ప్రత్యేకంగా సత్కరించారు. అంతేకాకుండా ఇంటర్మీడియట్ రాష్ట్రస్థాయిలో ఎంపిసి, బైపీసీ విభాగాలలో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను కూడా అభినందించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్స్ అబ్బూరి వెంకటేశ్వర్లు, షావుల్ హమీద్, ఇర్ఫాన్, పొన్నగంటి వెంకట్రావు, ఇంచార్జి వెంకారెడ్డి, తదితర ఉపాధ్యాయ సిబ్బంది, కందుకూరు ఆక్స్‌ఫర్డ్ పాఠశాల ప్రిన్సిపాల్స్, సిబ్బంది, డిగ్రీ కళాశాల సిబ్బంది, కనిగిరి కాలేజ్ డైరెక్టర్ రాంబాబు, కనిగిరి కాలేజ్, స్కూల్ సిబ్బంది, తదితర ఉపాధ్యాయ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

# స్వర్ణాంధ్ర విజన్ బాపట్ల దిశగా అధికారులు పని చేయాలి

## జిల్లా కలెక్టర్ డాక్టర్ వి వినోద్‌కుమార్



**(షణ్ముఖ వెలుగు, బాపట్ల, డిసెంబర్ 8)**

స్వర్ణాంధ్ర విజన్ బాపట్ల దిశగా అధికారులు పనిచేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ తెలిపారు. ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల అమలు తీరుపై జిల్లా, డివిజన్, మండలస్థాయి అధికారులతో సోమవారం స్థానిక కలెక్టరేట్ నుంచి ఆయన వీక్షణ సమావేశం నిర్వహించారు. ఉపాధి పనులు లక్ష్యం మేరకు వేగంగా చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు. కూలీలకు ఉపాధి చూపాలని, ఉపాధి హామీ పనులలో పురోగతి ఉండాలన్నారు. పంచాయతీ కార్యాలయాల భవనాలు 10 మంజూరు కాగా తక్షణమే నిర్మించాలన్నారు. ఒక్కొక్కటి రూ.32 లక్షలతో భవనం నిర్మించేందుకు ప్రభుత్వం అనుమతులు ఇచ్చిందన్నారు. గోకులం షెడ్లు త్వరగా నిర్మించాలన్నారు. ఇంకుడు గుంతలు, మురికి కాల్వలు, గ్రామాలలో పూడిపోయిన చెరువులను పునర్వినియోగానికి తక్షణమే చర్యలు తీసుకోవాలన్నారు. వర్షపు నీటిని భూమిలో భద్రపరచడానికి చర్యలు తీసుకోవాలన్నారు. గడిచిన మూడేళ్లలో ఈ సంవత్సరంలో యూరియా వాడకం అధికంగా ఉన్నందున క్రయవిక్రయాలపై ఆన్‌లైన్‌లో నివేదిక పంపాలన్నారు. యూరియా వాడకంపై పంటలకు ఎదురయ్యే సమస్యలపై క్షేత్రస్థాయిలో పరిశీలించి నివేదించాలన్నారు. ధాన్యం పంట కొనుగోలు ప్రక్రియను ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా భావిస్తున్నందున అధికారులు చిత్తశుద్ధితో పనిచేయాలని కలెక్టర్ తెలిపారు. డిసెంబర్ నెల చివరినాటికి ఒక లక్ష మెట్రిక్ టన్నులు ధాన్యం కొనుగోలు లక్ష్యంగా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. టాస్క్ ఫోర్స్ బృందాలు ముమ్మరంగా తనిఖీలు చేయాలన్నారు. ముఖ్యంగా మిల్లులను తనిఖీ చేసే సమయంలో గోనెసంచులను దృష్టిలో ఉంచుకోవాలన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలపై ఆర్డీవోల పర్యవేక్షణ ఉండాలన్నారు. రైస్ మిల్లలను ఆర్డీవోలు తనిఖీ చేయాలని సూచించారు. 1,000 టార్పాలిన్ పట్టలు ఆర్ఎస్కే లకు పంపామన్నారు. రైతులు ఆందోళన చెందకుండా వాటిని వినియోగించుకోవాలన్నారు. రైతు సేవా కేంద్రాలలో తేమ యంత్రాలు ఉన్నాయని, రైతులకు అవసరమైనన్ని గోనె సంచులు సిద్ధంగా ఉంచామన్నారు. ధాన్యం అమ్ముకోటానికి వచ్చే రైతులు గోనె సంచులు తెచ్చుకుంటే వారికి ప్రభుత్వమే నగదు చెల్లిస్తుందన్నారు. ఈ విషయాలపై రైతులకు అవగాహన కల్పించాలని, అర్థమయ్యేలా వివరించాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా సంయుక్త కలెక్టర్ భావన విశిష్ట, ఆర్డీవోలు గ్లోరియా, చంద్రశేఖర్, రామలక్ష్మి, వ్యవసాయశాఖ డిడి అన్నపూర్ణ, డ్వామా పిడి విజయలక్ష్మి, గృహ నిర్మాణ శాఖ పిడి వెంకటేశ్వరరావు, మార్క్‌ఫెడ్ జిఎం అరుణశ్రీ, గ్రామ, వార్డు సచివాలయాల జిల్లా కోఆర్డినేటర్ యశ్వంత్, ఇడిఏం కుమార్ రాజన్, తహసిల్దార్లు, తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్రంలో మంచి గుర్తింపు తెచ్చిన గిద్దలూరు మానవతాశాఖ

## శాఖను అభినందించిన జిల్లా ప్రధాన కార్యదర్శి కపురం శ్రీనివాసరెడ్డి

**(షణ్ముఖ వెలుగు, గిద్దలూరు, డిసెంబర్ 8)**


గిద్దలూరు పట్టణంలోని పెన్షనర్ కార్యాలయంలో గిద్దలూరు మానవతా శాఖ నిర్వహించిన సమావేశానికి శాఖ అధ్యక్షులు సత్యనారాయణరెడ్డి అధ్యక్షత వహించగా ముఖ్య అతిథులుగా జిల్లా ప్రధాన కార్యదర్శి కపురం శ్రీనివాసరెడ్డి, జిల్లా శాఖ డైరెక్టర్ యం ఏసోబు హాజరయ్యారు. ఈ సందర్భంగా కపురం శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ గిద్దలూరు మానవ శాఖ గిద్దలూరు పరిసర ప్రాంతాలలో వృద్ధులకు దుప్పట్ల పంపిణీ కార్యక్రమం, పేదవారికి ఆర్థిక సహాయం, ప్రతిభ గల విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు, పర్యావరణ పరిరక్షణ కోసం మొక్కలు నాటడం, ఐ క్యాంపు నిర్వహణ, అనాధ శవాలకు దహన కార్యక్రమాలు తదితర సామాజిక సేవా కార్యక్రమాలు చేస్తూ రాష్ట్రంలోనే మంచి గుర్తింపు తెచ్చుకున్న శాఖగా నిలిచిందన్నారు. జిల్లా మానవత శాఖ డైరెక్టర్ ఏసోబు మాట్లాడుతూ గిద్దలూరు స్మశాన వాటికను అభివృద్ధి పరిచి అందరికీ అందుబాటులోకి తీసుకురావటానికి కృషి చేయాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ట్రెజరర్ వెంకటేశ్వర్లు, డైరెక్టర్ రవీంద్రారెడ్డి, భాస్కర్‌రెడ్డి, సామాజిక కార్యకర్త నారాయణరెడ్డి, వీరారెడ్డి, రంగయ్య, పిచ్చయ్య, తదితరులు పాల్గొన్నారు.



# ధాన్యం విక్రయించే రైతులకు గోనె సంచులు ఉచితంగా ఇవ్వాలి

## జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్




**(షణ్ముఖ వెలుగు, బాపట్ల, డిసెంబర్ 8)**

ధాన్యం విక్రయించే రైతులకు గోనె సంచులు ఉచితంగా ఇవ్వాలని, గోనె సంచులు తెచ్చుకున్న వారికి అధికారులే నగదు చెల్లించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ ఆదేశించారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వహణపై కమాండ్ కంట్రోల్ రూమ్ సిబ్బందితో ఆయన సోమవారం సమావేశం నిర్వహించారు. ధాన్యం విక్రయించడానికి రైతులే స్వయంగా గోనె సంచులు తెచ్చుకుంటే ప్రభుత్వం నగదు చెల్లిస్తుందని కలెక్టర్ స్పష్టం చేశారు. వరి పంటకు సులభతరంగా గోనె సంచులు అందించాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుందన్నారు. రైతులు స్వయంగా గోనె సంచులు తెచ్చుకుంటే ఒక్కొక్క సంచికి రూ.4.74లు చొప్పున ప్రభుత్వమే నగదు ఇస్తుందన్నారు. గోనెసంచుల గురించి రైతులు చింతించాల్సిన అవసరం లేదన్నారు. బాపట్ల జిల్లాలో ఇప్పటివరకు 2,546 మంది రైతుల నుంచి 15,605 మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించామన్నారు. 75 కేజీల పరిమాణం ఉన్న ఎనిమిది లక్షల గోనె సంచులను రైతు సేవ కేంద్రాలకు పంపామన్నారు. మరో 14.93 లక్షల గోనె సంచులు మిల్లర్ల వద్ద అందుబాటులో ఉన్నాయన్నారు. రైతులకు అవసరమైన అన్ని గోనె సంచులు జిల్లాలో ఉన్నాయని వివరించారు. 76 మిల్లులు ధాన్యం కొనుగోలులో పాల్గొంటున్నాయన్నారు. బ్యాంకు పూచికత కింద రూ.100 కోట్లు మిల్లర్లు చెల్లించాలని లక్ష్యం కాగా, ఇప్పటి వరకు రూ.43 కోట్లు ప్రభుత్వానికి చెల్లించాయన్నారు. రైతుల సంక్షేమం కోసం ప్రభుత్వం పనిచేస్తుందని కలెక్టర్ చెప్పారు. ఈ సమావేశంలో డి ఆర్ ఓ జి.గంగాధర్ గౌడ్, పౌరసరఫరాల శాఖ జిల్లా అధికారి జమీర్ బాషా, పౌరసరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ శ్రీలక్ష్మి, కమాండ్ కంట్రోల్ రూమ్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# మండల ఎస్‌టియు నూతన కార్యవర్గం ఎంపిక



**(షణ్ముఖ వెలుగు, ఉలవపాడు, డిసెంబర్ 8)**

మండల శాఖ అధ్యక్షుడు ఏ వెంకటాద్రి నాయుడు అధ్యక్షతన ఉలవపాడు హైస్కూల్ నందు ఆదివారం జరిగిన ఎస్టియు కార్యవర్గ సమావేశం నందు నూతన మండల కమిటీని ఎన్నుకోవడం జరిగింది. అనంతరం ఉపాధ్యాయ సమస్యల పై పలు తీర్మానాలు ఆమోదించారు. ఉపాధ్యాయులకు రావలసిన గత బకాయిలను వెంటనే చెల్లించాలని, ఉపాధ్యాయులకు గత రెండు సంవత్సరాల నుండి ఇవ్వవలసిన సరెండర్ లీవ్‌ను మంజూరు చేయాలని, ఉపాధ్యాయుల పట్ల ఉన్న పని భారాన్ని తగ్గించాలనే పలు తీర్మానాలను ఆమోదించడం జరిగింది. అనంతరం సమావేశం నందు మండల నూతన అధ్యక్షుడిగా బడితల శ్రీనివాసులు, ప్రధాన కార్యదర్శిగా వేల్పుల రమేష్, ఆర్థిక కార్యదర్శిగా పిచ్చయ్యలను ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది.

# అర్జీల పరిష్కారం పై అధికారులు చిత్తశుద్ధితో పనిచేయాలి

## జిల్లా కలెక్టర్ డాక్టర్ వి వినోద్ కుమార్







**(షణ్ముఖ వెలుగు, బాపట్ల, డిసెంబర్ 8)**

ప్రజా సమస్యల పరిష్కారం కార్యక్రమంలో వచ్చే అర్జీల పరిష్కారంపై అధికారులు చిత్తశుద్ధితో పనిచేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వి వినోద్ కుమార్ తెలిపారు. సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని పీజీఆర్ఎస్ హాల్లో ప్రజా సమస్యల పరిష్కార కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లా నలుమూలల నుండి వచ్చే ప్రజల సమస్యల పరిష్కార అర్జీలపై అధికారులు వెంటనే స్పందించి వాటికి పరిష్కారం చూపాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ అన్నారు. ప్రజా సమస్యల అర్జీలను సంబంధిత శాఖ అధికారులకు ఆన్లైన్లో పంపించినప్పటికీ వాటిని కొంతమంది అధికారులు చూడటం లేదని, అట్లు చూడని వారిపై చర్యలు తీసుకోబడతాయని ఆయన అన్నారు. జిల్లా, మండలం, కార్యాలయ లవారీగా ప్రజా సమస్యల అర్జీల పై ఆయన ఆరా తీశారు. మార్టూరు మండలంలో ఎక్కువగా అర్జీలు రావటానికి గల కారణాలపై ఆయన ఆరా తీశారు. అర్జీలను ప్రీ ఆడిట్ చేయుటలో కొన్ని మండలాల పనితీరు సరిగా లేదని, వాటికి సంబంధించిన జిల్లా అధికారులు పర్యవేక్షణ చేయాలన్నారు. ముఖ్య ప్రముఖుల నుండి వచ్చే అర్జీలను సత్వరమే పరిష్కరించాలన్నారు. సమస్యల పరిష్కారంలో నాణ్యమైన చక్కని ఎండార్స్మెంట్ ద్వారా అర్జీదారునికి అందజేయాలని, అర్జీల ఆడిటింగ్ విషయంలో అర్జిదారునికి అవగాహన కల్పించే విధంగా, అదే సమస్య పునరావ ృతం కాకుండా చర్యలు తీసుకోవాలని ఆయన అధికారులకు సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం అందించే వివిధ సంక్షేమ పథకాలపై, కార్యాలయాల పనితీరుపై ప్రభుత్వం ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టిందని జిల్లా కలెక్టర్ డాక్టర్ వి వినోద్ కుమార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో అనేక అంశాలు జోడిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ విషయంలో అధికారులు జాగ్రత్త వహించాలని, అధికారులు వారి శాఖ నిర్వహించే పనులపై సమగ్ర సమాచారాన్ని కలిగి ఉండాలని, ప్రభుత్వం అడిగే ప్రశ్నలకు స్పందించని అధికారులపై క్రమశిక్షణా చర్యలు తీసుకుంటున్నట్లు ఆయన తెలిపారు. అధికారులందరూ చిత్తశుద్ధితో పనిచేసి అన్ని విషయాలలో జిల్లాను మూడో స్థానంలో, అంతకంటే పై స్థాయిలో ఉంచే విధంగా పనిచేయాలని, అట్లు జరిగన పక్షంలో సంబంధిత అధికారులపై చర్యలు తీసుకోబడునని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంయుక్త కలెక్టర్ భావన విశిష్ట, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ విజయమ్మ, పిడి డిఆర్డిఏ లవన్న, జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

---

# ఫిర్యాదులపై విచారణ చేపట్టి సత్వర పరిష్కారం అందించడమే లక్ష్యం

## జిల్లా ఎస్పీ వి హర్షవర్ధన్ రాజు



**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, డిసెంబర్ 8)**

ప్రజల నుండి వచ్చే వివిధ రకాల ఫిర్యాదులను పరిష్కరించేందుకు సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్పీ, పోలీస్ అధికారులు "ప్రజా ఫిర్యాదుల పరిష్కార కార్యక్రమం (మీకోసం)" నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా నలుమూలల నుండి వచ్చిన ప్రజలు స్వేచ్ఛాయుత వాతావరణంలో వారి లిఖితపూర్వక అర్జీలతో వారి సమస్యలను ధైర్యంగా జిల్లా ఎస్పీ, పోలీస్ అధికారులకు విన్నవించారు. పోలీసులు ఫిర్యాదుదారులతో ముఖాముఖీగా మాట్లాడి, వారి ఫిర్యాదుల పూర్వాపరాలను తెలుసుకుని, వాటిని చట్టపరంగా త్వరితగతిన పరిష్కరిస్తామని భరోసా ఇచ్చారు. అందిన ఆయా ఫిర్యాదులపై ఎస్పీ గారు సంబందిత పోలీస్ స్టేషన్ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడి ఆ ఫిర్యాదులపై తక్షణ విచారణ చేపట్టి, చట్ట ప్రకారం తగిన చర్యలు తీసుకోని భాధితులకు న్యాయం అందించేలా చూడాలని ఆదేశించారు. మీ కోసం ఫిర్యాదులపై అలసత్వం వహించకుండా నిర్ణీత గడువులో ఫిర్యాదులు పరిష్కారించాలని అధికారులను ఎస్పీ ఆదేశించారు. ఫిర్యాదు చేయడానికి వచ్చే వృద్ధులు, నడవలేని స్థితిలో ఉన్నవారి సమస్యలను విని, వారికి సత్వర న్యాయం కల్పించాలని, సంఘటన ప్రదేశాన్ని సందర్శించాలని పోలీస్ అధికారులకు జిల్లా ఎస్పీ ఆదేశించారు. జిల్లా పోలీస్ కార్యాలయానికి రాలేని ప్రజలు తమ ఫిర్యాదులను స్థానిక పోలీస్ స్టేషన్లు, సర్కిల్ కార్యాలయాలు, సబ్–డివిజన్ కార్యాలయాలలో కూడా సమర్పించవచ్చని జిల్లా ఎస్పీ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎక్కువగా సివిల్, భూ, ఆర్థిక తగాదాలు, అత్తరింటి వేధింపులు, ఉద్యోగ మోసాలు, పలు ఫిర్యాదులు ఉన్నాయి.



ఫిర్యాదుల్లో కొన్ని.... తన వద్ద నుండి కారును 4 రోజులకు బాడుగకు ఒంగోలు సత్యనారాయణపురం చెందిన వ్యక్తి తీసుకోని కారు తిరిగి ఇవ్వకుండా ఫోన్ చేస్తుంటే సమాధానం ఇవ్వటం లేదని, 4 నెలలు గడిచిన తన కారు, బాడుగ డబ్బులు ఇవ్వలేదని ఒంగోలులోని జెడ్పీ కాలనీ చెందిన ఒక వ్యక్తి ఫిర్యాదు చేశారు. కొత్తపట్నం గ్రామానికి చెందిన తన కుమారుడు మమల్ని కొడుతూ, తిడుతూ ఇబ్బంది పెడుతున్నాడని మాకు న్యాయం చేయాలని కొత్తపట్నం మండలానికి చెందిన తల్లిదండ్రులు(వృద్ధులు) ఫిర్యాదు చేసారు. తన కుమారుడికి రైల్వే టీసీ ఉద్యోగం ఇప్పిస్తానని ఒంగోలు రైల్వే పార్శిల్లో పనిచేస్తున్న ఒక వ్యక్తి తన వద్ద నుండి రూ.4 లక్షలుడబ్బులు తీసుకొని ఉద్యోగం ఇప్పించకపోగా డబ్బులు అడుగుతుంటే ఇవ్వటం లేదని ఒంగోలు సంతపేటకు చెందిన ఒక మహిళ ఫిర్యాదు చేసింది. ఫిర్యాదిని మానసికంగా, శారీరకంగా వేదిస్తునట్లు రూ.3 లక్షలు అదనపు కట్నం కోసం తన భర్త తనను పలు విధాలుగా వేధిస్తున్నారని బేస్తవారిపేట మండలంకు చెందిన ఒక మహిళ ఫిర్యాదు చేసింది. ఈ కార్యక్రమంలో మహిళా పోలీస్ స్టేషన్ డిఎస్పీ వి వి రమణకుమార్, పిసిఆర్ ఇన్స్పెక్టర్ దుర్గాప్రసాద్, సింగరాయకొండ సీఐ సీహెచ్ హజరత్తయ్య, దర్శి సీఐ వై రామారావు, మార్కాపురం సీఐ సుబ్బారావు, కొండెపి సీఐ సోమశేఖర్, సమస్యల పరిష్కార వేదిక ఎస్ఐ జనార్ధన్‌రావు, సిబ్బంది పాల్గొన్నారు.

---

# అభివృద్ధి కార్యక్రమాలకు అధికారులు భూసేకరణ చేపట్టాలి

**(షణ్ముఖ వెలుగు, బాపట్ల, డిసెంబర్ 8)**



అభివృద్ధి కార్యక్రమాలకు అధికారులు భూసేకరణ వేగంగా చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ తెలిపారు. భూ సేకరణ ప్రక్రియపై అనుబంధ శాఖల అధికారులతో సోమవారం స్థానిక కలెక్టరేట్ నుంచి కలెక్టర్ వీక్షణ సమావేశం నిర్వహించారు. నిజాంపట్నం మండలంలో రాడార్ కేంద్రానికి 1.50 ఎకరాల భూమి కేటాయించాలని కలెక్టర్ చెప్పారు. నెడ్ క్యాప్ ద్వారా సౌర విద్యుత్ ఉత్పత్తి చేయడానికి బయోమాస్ పవర్ ప్లాంట్ ఏర్పాటుకు మార్టూరులో 100 ఎకరాల భూమి కేటాయించాలని అధికారులను ఆదేశించారు. బాపట్ల జిల్లా కేంద్రంలో హెలీ ప్యాడ్ ఏర్పాటు చేయడానికి 10 ఎకరాల భూమి కేటాయించాలన్నారు. ల్యాండ్ బ్యాంక్ ఏర్పాటు చేయాలని, ప్రభుత్వ భూమి, అసైన్డ్ భూమి ఇందులో ఉంచాలని ఆర్ డి ఓ లకు కలెక్టర్ సూచించారు. గ్రామీణ ఉపాధి శిక్షణ కేంద్రానికి భూమి కేటాయించాలన్నారు. ఇంటిగ్రేటెడ్ కలెక్టరేట్ భవనానికి 57.13 ఎకరాల భూమి కేటాయించినట్లు అధికారిక అనుమతి కొరకు సిసిఎల్ఏ కు నివేదించామన్నారు. జిల్లా కోర్టుకు 2.50 ఎకరాల భూమి కేటాయించగా, 10 ఎకరాలు కావాలని న్యాయ శాఖ నుంచి వినతులు వచ్చాయన్నారు. వాటిని పరిశీలించాలని, బీసీ భవనానికి రెండు ఎకరాలు, ఎస్టీ భవనానికి రెండు ఎకరాల భూమి, మెప్మా ద్వారా పెట్రోల్ బంక్ ఏర్పాటు చేయడానికి 2,500 చదరపు అడుగులు భూమి గుర్తించాలన్నారు. డ్రైవింగ్ టెస్టింగ్ ట్రాక్ కొరకు ఐదు ఎకరాలు, మార్క్ఫెడ్ కార్యాలయానికి 10 సెంట్లు భూమి గుర్తించాలన్నారు. 54 ప్రాంతాలలో హెల్త్ వెల్నెస్ సెంటర్ల నిర్మాణానికి భూమి గుర్తించాలన్నారు. పర్చూరులో రైతు బజార్ నిర్మాణానికి భూమి ఇవ్వాలని, వేమూరు మండలం జంపని గ్రామంలో సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ పాఠశాలకు 5 ఎకరాల భూమి గుర్తించాలన్నారు. వివిధ అభివృద్ధి కార్యక్రమాలకు 25 అంశాలపై ఆయన సంబంధిత అధికారులతో సమీక్షించారు. ఈ సమావేశంలో డిఆర్ఓ జి గంగాధర్ గౌడ్, ఆర్డీవోలు, వివిధ శాఖల జిల్లా అధికారులు, తహసిల్దార్లు, తదితరులు పాల్గొన్నారు.

---

# బద్వేల్ అర్బన్ ఎస్ఐ2గా బాధ్యతలు చేపట్టిన జయ రాములు



**(షణ్ముఖ వెలుగు, బద్వేల్, డిసెంబర్ 8)**

బద్వేల్ అర్బన్ ఎస్ఐ2గా జయ రాములు సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఈయన గతంలో అన్నమయ్య జిల్లాలో ఎస్ఐగా పనిచేస్తూ సాధారణ బదిలీ పై బద్వేల్ అర్బన్ ఎస్ఐ 2గా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాంతి భద్రతల పర్యవేక్షణలో ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదన్నారు.

---

# వైఎస్సార్ కూడలిలో ప్రమాదకర గుంత



**(షణ్ముఖ వెలుగు, పుల్లలచెరువు, డిసెంబర్ 8)**

మండల కేంద్రంలోని వైఎస్సార్ కూడలి వద్ద ఏర్పడిన పెద్ద గుంత స్థానికులకు తీవ్ర ఇబ్బందులు కలిగిస్తోంది. రహదారి మధ్యలో మురుగునీరు నిల్వ ఉండడంతో గుంత మరింత లోతు మారింది. ఈ మార్గం దాటే వాహనదారులు ప్రతిరోజూ ప్రమాదాన్ని అంచనా వేసుకుంటూ ప్రయాణిస్తున్నారు. ముఖ్యంగా ద్విచక్రవాహనాలు జారిపడే పరిస్థితులు పలుమార్లు చోటుచేసుకున్నాయని ప్రజలు పేర్కొన్నారు. స్థానికులు గుంత ఎంత పెద్ద సమస్యగా ఏ స్థాయికి చేరిందో స్పష్టంగా చూపిస్తున్నాయి. గత వర్షాల కారణంగా రహదారి దెబ్బతిన్నప్పటికీ, ఇప్పటివరకు సంబంధిత శాఖలు మరమ్మతులకు ముందుకు రాకపోవడంతో ప్రజల్లో ఆందోళన నెలకొంది. రహదారి పరిస్థితిపై పలుమార్లు మండల అధికారులకు, పంచాయతీ అధికారులకు సమాచారం ఇచ్చినప్పటికీ ఇప్పటికీ చర్యలు తీసుకోలేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రయాణికుల భద్రత కోసం గుంతను వెంటనే పూడ్చి రహదారిని సక్రమంగా పునరుద్ధరించాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

# నేడు సోనియా గాంధీ 79వ జన్మదినోత్సవ వేడుకలు



**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, డిసెంబర్ 8)**

కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు షర్మిలా రెడ్డి ఆదేశాల మేరకు కాంగ్రెస్ పార్టీ అధినేత్రి సోనియా గాంధీ 79వ జన్మదిన సందర్భంగా మంగళవారం ఉదయం 10 గంటలకు జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో కేక్ కటింగ్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు షేక్ సైదా సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. కావున ఈ వేడుకల్లో కాంగ్రెస్ పార్టీ శ్రేణులు భారీ సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని ఆయన కోరారు.

# జిల్లా పార్టీ కార్యాలయంలో ప్రజాదర్బార్







**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, డిసెంబర్ 8)**

జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయం నందు సోమవారం ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్‌రావు ప్రజా ధర్బార్ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజల సమస్యలు తెలుసుకొని వారి నుండి నేరుగా వినతులు స్వీకరించారు. నియోజకవర్గంలోని ప్రజల సమస్యలను క్షేత్ర స్థాయిలోనే పరిష్కరించడమే ప్రధాన లక్ష్యంగా ప్రభుత్వం కృషి చేస్తోందని ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ పేర్కొన్నారు. ప్రజాదర్బార్‌కు నియోజకవర్గం నుండి పెద్ద సంఖ్యలో ప్రజలు హాజరై తమ సమస్యలు, వినతులను ఎమ్మెల్యేకి తెలియజేశారు. పెన్షన్లు, ఇళ్ల స్థలాలు, రుణాల మంజూరు, వివిధ సంక్షేమ పథకాల ప్రయోజనాలు, గ్రామాభివృద్ధికి సంబంధించి ఎదురవుతున్న ఇబ్బందులపై వచ్చిన విజ్ఞప్తులను ఎమ్మెల్యే స్వయంగా స్వీకరించి వెంటనే స్పందించారు. సంబంధిత అధికారులను పిలిచి ప్రత్యక్షంగా ఆదేశాలు జారీ చేసి, ప్రజలకు త్వరితగతిన పరిష్కారం అందేలా చర్యలు తీసుకున్నారు.

# రిమ్స్ ముందు దళితుల ఆందోళన దళిత నేతల హెచ్చరికలు

### దేశం నాయకుల కనుసన్నల్లో టూ టౌన్ సీఐ డ్రామా
### నళినీ అనుమానాస్పద మృతిని ఎస్సీ, ఎస్టీ యాక్ట్ బలవన్మరణం కేసుగా నమోదు







**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, డిసెంబర్ 8)**

దళితుల ఆందోళన, దళిత నేతల హెచ్చరికల నేపథ్యంలో ఒంగోలు టూ టౌన్ పోలీసులు దళిత యువతి మైలారి నళినీ అనుమానాస్పద మృతిని క్రైమ్ నెంబర్ 166/25 ఎస్సీ, ఎస్టీ యాక్ట్, బలవన్మరణం కేసుగా నమోదు చేశారు. ఆదివారం మరణించిన మైలారి నళినీ మృతదేహం వద్ద లభించిన సూసైడ్ నోటు ఇతర ఆధారాలను తీసుకువెళ్లిన పోలీసులు కేసు మాత్రం నమోదు చేయలేదు. సోమవారం నళినీ మృతదేహానికి పోస్టుమార్టం, శవ పంచనామా జరిపే క్రమంలో, పోలీసులు నళిని మరణాన్ని అనుమానాస్పద మృతిగా బీఎన్ఎస్ 194గా తొలుత కేసు నమోదు చేశారు. దీంతో దళిత నేతలు నీలం నాగేంద్రరావు పోలీసులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మరణించిన వ్యక్తి ఎస్సీ మాల కులస్తురాలని, ఆమె బలవన్మరణానికి కారణమైన వ్యక్తి బీసీ కులస్తుడని సూసైడ్ నోట్ రూపంలో స్పష్టమైన సాక్ష్యం ఉన్నప్పటికీ, పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు ఎలా నమోదు చేస్తారని నాగేంద్ర మండిపడ్డారు. టూ టౌన్ సీఐ హై డ్రామాకు దేశం నాయకుల దర్శకత్వం వహించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. దళిత సంఘాల జాతీయ ఐక్యవేదిక నాయకుడు డాక్టర్ చప్పిడి వెంగళరావు, మాల మహానాడు అధ్యక్షులు దారా అంజయ్య తదితరులు పోలీసుల నిర్లక్ష్యాన్ని ఎండ కట్టారు. జిల్లా కలెక్టర్ ఎస్పీలు నళినీ కుటుంబాన్ని పరామర్శించేందుకు వెళ్ళాలని వెంగళరావు డిమాండ్ చేశారు. నళినీ ఆదివారం మరణిస్తే ఆలస్యంగా కేసు నమోదు చేయడానికి కారణం ఏమిటని నిలదీశారు. ఒంగోలు ఎమ్మెల్యే కనుసన్నల్లో దళిత మహిళ చావులో అన్యాయం చేయడం తగదని నాగేంద్ర నిప్పులు చెరిగారు. పోలీసులు సెక్షన్ మార్చేందుకు మొండికేయడంతో, దళిత నేతలు తీవ్రస్థాయిలో హెచ్చరికలు చేశారు. నళినీ బంధువులు, కబాడీ పాలెం వాసులు పెద్ద ఎత్తున రిమ్స్ వద్దకు చేరుకొని ఆందోళన చేశారు. నళినీ కేసులో నిజాలను సమాధి చేస్తే సహించేది లేదని నాగేంద్ర హెచ్చరించారు. నళినీ బలవన్మరణం కేసులో పోలీసుల వైఖరే అనుమానాస్పదమని నాగేంద్ర తీవ్ర స్థాయిలో విరుచుకు పడ్డారు. దీంతో ఒంగోలు టూ టౌన్ పోలీసులు మైలారి నళినీ మరణాన్ని తొలుత అనుమానాస్పద మృతిగా నమోదు చేసినప్పటికీ, తరువాత సెక్షన్ ఆల్టర్ చేశారు. క్రైమ్ నెంబర్ 166 /2025 బీఎన్ఎస్ సెక్షన్లు 108, ఎస్సీ ఎస్టీ యాక్ట్ సెక్షన్ 3 (2) 5 వేశారు. టూ టౌన్ సీఐ మేడా శ్రీనివాస్ రావు ఆల్టర్ ఎఫ్ ఐ ఆర్ కాపీని కలెక్టరేట్ ముందు ఆందోళన చేస్తున్న నళినీ కుటుంబ సభ్యులు, దళిత నాయకులు, కబాడీ పాలెం వాసులకు అందచేశారు. అన్ని సాక్షాలు ఆధారాలు ఉన్న కేసులోని జిల్లా కేంద్రం, ఒంగోలు పట్టణంలో న్యాయం కోసం దళితులు స్వాతంత్ర్యం వచ్చిన 78 ఏళ్ల తరువాత కూడా ఆందోళన చేయాల్సి రావటం, అగ్రకుల మనువాద ప్రభుత్వాలు దళితుల పట్ల చూపుతున్న వివక్షకు నిదర్శనం అని దళిత హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షులు నీలం నాగేంద్రరావు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ కట్ట సుధాకర్, మాదిగ సంక్షేమ పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు కొమ్ము సుజన్ కుమార్, ముప్పవరపు గోపి, కేవీపీఎస్ రఘురామ్ తదితరులు పాల్గొన్నారు.

## అంబేద్కర్ భవనం వినియోగంలోకి తేవాలి



**(షణ్ముఖ వెలుగు, బద్వేల్, డిసెంబర్ 8)**

పట్టణంలోని బాబాసాహెబ్ అంబేద్కర్ భవనాన్ని వినియోగంలోకి తేవాలని కోరుతూ సోమవారం దళిత ప్రజాసంఘా నాయకుల ఆధ్వర్యంలో ఆర్డీవోకు వినతిపత్రం అందించారు. భవనం పూర్తి అయ్యి దాదాపు 15 సంవత్సరాలు అవుతున్నా ప్రారంభానికి నోచుకోలేదని, దీనిని ప్రారంభించకపోవడం. వలన అక్కడ సామాజిక కార్యక్రమాలు, సభలు నిర్వహించుకునేందుకు వీలులేకుండా పోయిందని, అలాగే అక్కడ సిమెంటు రోడ్డు కూడా వసతి కల్పించాలని కోరగా అందుకు ఆర్డీవోకు సానుకూలంగా స్పందించి పై అధికారులతో మాట్లాడి ప్రారంభానికి చర్యలు చేపడతామన్నారు. ఈ కార్యక్రమంలో దళిత ప్రజాసంఘాల నాయకులు ముండ్లపాటి పిచ్చయ్య, వెంకటరమణ, యం. రమణ, యోనా ప్రసన్న, చిన్నయ్య, నరసింహులు, తదితరులు పాల్గొన్నారు.

# ప్లాస్టిక్ వినియోగం ఆపండి మన భూమిని రక్షించండి

**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, డిసెంబర్ 8)**

స్థానిక ముంగమూరు రోడ్లోని ఎస్ఎస్ఎన్ డిగ్రీ కళాశాల వాలంటీర్లు జాతీయ సేవా పథకంలో భాగంగా ఎన్ఎస్ఎస్ యూనిట్ 1, యూనిట్ 2 కొత్తపట్నం మండలం సంకువారిగుంట, టంగుటూరు మండలం సూరారెడ్డిపాలెంలో ప్లాస్టిక్ వినియోగం ఆపండి- మన భూమిని రక్షించండి అనే అంశం పై అవగాహన కార్యక్రమం నిర్వహించినట్టు కళాశాల డైరెక్టర్, ప్రిన్సిపల్ వై సత్యనారాయణ రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ప్రతి సంవత్సరం లక్షల టన్నులు ప్లాస్టిక్ వ్యర్థాలు పడిపోతున్నాయి. ఇవి పూర్తిగా కుళ్లడడానికి వందల సంవత్సరాలు పడుతుంది. ప్లాస్టిక్ కారణంగా నేల, నీరు, వాతావరణం తీవ్ర కాలుష్యానికి గురవుతున్నాయి సమస్త జీవరాశులకు తీవ్రమైన ముప్పుగా మారింది ఈ నేపథ్యంలో ప్రజలందరూ ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించి పర్యావరణానికి అనుకూలమైన ప్రత్యామ్నాయాలను ఉపయోగించవలసిన బాధ్యత ఎంతైన ఉన్నదని, ప్రభుత్వం అమలు చేస్తున్న ప్లాస్టిక్ నిషేధ చర్యలకు ప్రతి ఒక్కరు సహకరించాలని సూచించారు. అనంతరం సంకువారికుంట గ్రామం ప్రధాన రహదారులలో ఏర్పడిన గుంతల వల్లన ప్రయాణికులకు ఆటంకంగా ఉన్నందున వాలంటీర్లు రహదారుల గుంతలను పూడ్చి ప్రయాణికులకు ఆటంకం లేకుండా చేశారు అలాగే సూరారెడ్డిపాలెం గ్రామంలో చెరువు చుట్టూ ఉన్న చిల్ల చెట్లను వాలంటర్లు తొలగించి శుభ్రపరిచారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులు టి రాజేంద్రబాబు, పీ నీలిమ, టి రవితేజ, బి శ్యామల, వైస్ ప్రిన్సిపల్ టి రాజశేఖర్ రెడ్డి, క్లస్టర్ సిఆర్పి పీ శ్రీదేవి, అధ్యాపకులు నవీన్, హేమన్, రాజకుమార్, అధ్యాపకేతర సిబ్బంది, ఆయా గ్రామస్తులు పాల్గొన్నారు.







# దాతలకు సత్కారం




**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, డిసెంబర్ 8)**

సాయుధ దళాల పతాక దిత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం పిజిఆర్ఎస్ హాల్లో జిల్లా కలెక్టర్ పి రాజాబాబు 2024 సాయుధ దళాల పతాక దినోత్సవ నిధికి ఉదారంగా విరాళాలు అందజేసిన వారిని ఘనంగా శాలువా, మెమెంటోతో సత్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని ప్రజలు, వ్యాపారవేత్తలు, పారిశ్రామికవేత్తలు సాయుధ దళాల పతాక దినోత్సవ నిధికి మరింతగా విరాళాలు అందించి దేశ రక్షణలో సేవలందిస్తున్న జవాన్ల కుటుంబాల పట్ల తమ ఐక్యతను తెలియజేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా జాయింట్ కలెక్టర్ ఆర్ పాలకృష్ణ, డిఆర్ఓ చిన్న ఓబులేసు, జిల్లా సైనిక సంక్షేమ అధికారి అబ్దుల్ రహీం, ఇతర జిల్లా అధికారులు పాల్గొన్నారు.









## అర్జీల పై దృష్టి సారించి నిర్ణీత గడువులోగా నాణ్యతతో పరిష్కారం చూపాలి

### జిల్లా కలెక్టర్ పి రాజాబాబు







**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, డిసెంబర్ 8)**

ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చిన అర్జీల పై సంబంధిత అధికారులు ప్రత్యేక దృష్టి సారించి నిర్ణీత గడువులోగా నాణ్యతతో పరిష్కారం చూపాలని జిల్లా కలెక్టర్ పి రాజాబాబు అన్ని శాఖల అధికారులను ఆదేశించారు. సోమవారం ఒంగోలు కలెక్టరేట్లోని పిజిఆర్ఎస్ సమావేశ మందిరంలో నిర్వహించిన "ప్రజా సమస్యల పరిష్కార వేదిక" (పిజిఆర్ఎస్) కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ రాజాబాబు, జాయింట్ కలెక్టర్ ఆర్ గోపాల క్రిష్ణ, జిల్లా రెవెన్యు అధికారి చిన ఓబులేసు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు శ్రీధర్‌రెడ్డి, కుమార్, జాన్సన్, కళావతి, విజయజ్యోతిలతో కలసి పాల్గొని ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. వచ్చిన అర్జీలను ఆయా శాఖల అధికారులకు సూచిస్తూ సత్వరం పరిష్కరించేలా ప్రత్యేక శ్రద్ధ చూపాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రజా సమస్యల పరిష్కారంకు రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నదని, "ప్రజా సమస్యల పరిష్కార వేదిక"లో వచ్చిన అర్జీల పై సంబంధిత అధికారులు ప్రత్యేక దృష్టి సారించి నిర్ణీత గడువులోగా నాణ్యతతో పరిష్కారం చూపాలన్నారు. ఇందులో ఎలాంటి అలస్వతం ఉండరాదన్నారు. ఎలాంటి పెండింగ్ ఉంచుకుండా అర్జీల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించాలని, ప్రతిరోజు మానిటర్ చేస్తూ అర్జీలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. సమస్యల పరిష్కారం కోసం అధికారుల వద్దకు వచ్చే ప్రజలతో మర్యాదగా ప్రవర్తించడమే కాక, వారి సమస్యను సావధానంగా విని నిబంధనల మేరకు సానుకూల విధానంలో పరిష్కారమయ్యేలా చూడాలన్నారు. సోమవారం నిర్వహించిన "ప్రజా సమస్యల పరిష్కార వేదిక" కార్యక్రమంలో 352 వినతులు వచ్చాయి. ఈ కార్యక్రమంలో వివిధ శాఖలకు చెందిన జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## సిఎం చంద్రబాబునాయుడు చిత్రపటానికి పాలాభిషేకం



**(షణ్ముఖ వెలుగు, కొనకనమిట్ల, డిసెంబర్ 7)**

ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు మార్కాపురం జిల్లాను ప్రకటించిన నేపథ్యంలో సోమవారం సాయంత్రం మండలంలోని ఎదురాళ్ళపాడు గ్రామంలో ఆయన చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల పార్టీ అధ్యక్షులు మూరబోయిన బాబురావు యాదవ్ మాట్లాడుతూ వెనుకబడ్డ పశ్చిమ ప్రాంతాన్ని వైసీపీ నేతలు గాలికొదిలేశారన్నారు. తమ నాయకుడు ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి 63 రోజుల పాటు వివిధ పోరాటాలు చేసినా వైసీపీ నేతలు జిల్లాను ఏర్పాటు చేయడం ఘోరంగా వైఫల్యం చెందారన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు మార్కాపురం జిల్లాను ప్రకటించి కూటమి ప్రభుత్వ చిత్తశుద్ధిని చాటుకుందన్నారు. అనంతరం మండల పార్టీ అధ్యక్షుడు మూరబోయిన బాబురావు యాదవ్ ఆధ్వర్యంలో సిఎం చంద్రబాబునాయుడు చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో కుందురు కాశిరెడ్డి, తాతిరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, ముప్వ కాటంరాజు, భాషాపతి నాయుడు, కనకం నరసింహారావు, శ్రీకాంత్ రెడ్డి, రోశయ్య, గురవయ్య, జయరాం, తిరుపతయ్య, యత్రయ్య, యల్లయ్య, ఆవులయ్య, శ్రీనివాస్‌రెడ్డి, బ్రహ్మారెడ్డి, కాశయ్య, కాశీరావు, తదితరులు పాల్గొన్నారు.

# చంద్రన్న మార్కాపురం జిల్లా అభివృద్ధే తన లక్ష్యం

## మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి









(షణ్ముఖ వెలుగు, మార్కాపురం టౌన్, డిసెంబర్ 8)

అన్ని రంగాల్లో వెనుకబడిన పశ్చిమ ప్రకాశం తెలుగుదేశం ప్రభుత్వ హయాంలోనే సస్యశ్యామలం కానుందని మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి స్పష్టం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం మార్కాపురం జిల్లాను ప్రకటించడం పట్ల మార్కాపురం పట్టణంలో లోని 15 వార్డులో సోమవారం సాయంత్రం కార్యకర్తల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అభినందన సభ, చంద్రబాబునాయుడు చిత్రపటానికి పాలాభిషేకం కార్యక్రమంలో ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. వైకాపా హయాంలో రాష్ట్రం దివాలా తీసిందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రాష్ట్ర అభివృద్ధి కోసం నిరంతరం శ్రమిస్తున్నారన్నారు. ఓట్లు దండుకొని వైకాపా ప్రభుత్వం మార్కాపురం జిల్లా ఇవ్వకుండా వివక్షత చూపిందని, ఎన్నికల్లో ఇచ్చిన వాగ్దానం మేరకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు మార్కాపురం జిల్లాను ప్రకటించి ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోయారన్నారు. దోచుకోవడం, దాచుకోవడం మినహా రాష్ట్ర అభివృద్ధి కోసం వైకాపా చేసింది శూన్యమన్నారు. మార్కాపురం జిల్లాగా ప్రకటించడం ప్రకటించడం వల్ల ఎంతో అభివృద్ధి సాధిస్తుందన్నారు. వెలుగొండ ప్రాజెక్టును కూడా త్వరలో పూర్తిచేసి పశ్చిమ ప్రకాశాన్ని సస్యశ్యామలం చేయడం జరుగుతుందన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నెరవేరుస్తూ రాష్ట్ర అభివృద్ధి కోసం నిరంతరం శ్రమిస్తున్నారని పేర్కొన్నారు. చెప్పిన మాటకు కట్టుబడి నెరవేర్చడమే కూటమి ప్రభుత్వ ధ్యేయమన్నారు. తన హయాంలో జిల్లా రావడం అదృష్టంగా భావిస్తున్నానన్నారు. జిల్లా సాధన కోసం ఎన్నో పోరాటాలు చేయడం జరిగిందని, ప్రజా మద్దతుతో పశ్చిమ ప్రాంత అభివృద్ధికి శక్తి వంచన లేకుండా కృషి చేస్తానన్నారు. ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చి చిత్తశుద్ధిని చాటుకుంటానన్నారు. అండగా నిలిచిన ప్రతి కార్యకర్తకు తోడుగా నిలుస్తానని, పేద ప్రజల సంక్షేమం కోసం శ్రమిస్తానని స్పష్టం చేశారు. అంతకు ముందు ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డికి పూల వర్షంతో వార్డు ప్రజలు స్వాగతం పలికారు. ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డికి ప్రజలు పూలమాలలు వేసి ఘనంగా సత్కరించారు. అనంతరం మహిళలు చంద్రబాబు నాయుడు చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ పోల్ మేనేజ్మెంట్ క్లస్టర్ ఇంచార్జి కందుల రామిరెడ్డి, బీజేపీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి పీవీ కృష్ణారావు, ఎన్డీఏ కూటమి నాయకులు, ముఖ్యంగా మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# పశ్చిమ ప్రాంత వెనుకబాటు తనం రూపుమాపేందుకే మార్కాపురం జిల్లా ఏర్పాటు

## టిఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి వరికుంట్ల అనిల్

(షణ్ముఖ వెలుగు, పొదిలి, డిసెంబర్ 8)









పశ్చిమ ప్రాంత వెనుకబాటుతనం రూపుమాపేందుకే మార్కాపురం జిల్లా ఏర్పాటు చేయడం జరిగిందని టిఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి వరికుంట్ల అనిల్ (పండు) అన్నారు. సోమవారం మండలంలోని కుంచేపల్లి గ్రామంలో సర్పంచ్ వరికుంట్ల కాంతమ్మ డేవిడ్, వరికుంట్ల అనిల్ ఆధ్వర్యంలో మార్కాపురంను జిల్లా చేయడంతో ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు చితప్రటానికి పాలాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా అనిల్ మాట్లాడుతూ మార్కాపురం జిల్లా ఏర్పాటు కావడంతో వెనుకబడ్డ ఈ ప్రాంతం వేగంగా అభివృద్ధి చెందుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు దోర్నాల అంజిరెడ్డి, పట్టణ అధ్యక్షులు ముల్లా ఖుద్దూస్, టిడిపి రాష్ట్ర కార్యదర్శి గునుపూడి భాస్కర్, మెడికల్ కౌన్సిల్ మెంబర్ డాక్టర్ స్వర్ణ గీత, జిల్లా ముస్లిం మైనార్టీ సెల్ అధ్యక్షులు షేక్ రసూల్ మహమ్మద్, శివాలయం కమిటీ ఛైర్మన్ ఒగ్గు వెంకట్రామయ్య, మాజీ శివాలయం కమిటీ ఛైర్మన్ సామంతపూడి నాగేశ్వరరావు, మాదాలవారిపాలెం సొసైటీ అధ్యక్షులు యర్రంరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, మండల పార్టీ ప్రధాన కార్యదర్శి కాటూరి శ్రీను, పట్టణ తెలుగు యువత అధ్యక్షులు షేక్ కాలేషా, మాజీ వార్డు సభ్యులు జ్యోతి మల్లిఖార్జున, తానికొండ వెంకట్రావు, ముని శ్రీనివాసులు, సామి రాజా, తదితరులు పాల్గొన్నారు.

# శాశ్వత నివేశా స్థలాలు ఇవ్వాలి జిల్లా కలెక్టర్‌కు వినతి పత్రం అందజేత

(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, డిసెంబర్ 8)

ఒంగోలు కార్పొరేషన్ పరిధిలోని దామచర్ల ఆంజనేయులు కాలనీ నందు నివాసం ఉంటున్న వారికి శాశ్వత నివేశా స్థలాలు ఇవ్వాలని మంజూరు చేయాలని కోరుతూ జిల్లా కలెక్టర్ కు వినతి పత్రం అందజేశారు. భారతీయ జనతా మార్దూర్ సంఘ్ ఆధ్వర్యంలో ముందుగా అంబేద్కర్ భవనం నందు సమావేశం నిర్వహించారు. అనంతరం కాలనీ వాసులు ర్యాలీగా వెళ్లి జిల్లా కలెక్టర్ కి తమ సమస్యలను వెళ్లబోసుకున్నారు. అనంతరం అంబేద్కర్ భవనం నందు నిర్వహించిన సమావేశంలో బిజెఎంఎస్ రాష్ట్ర అధ్యక్షులు నాలి మధు యాదవ్ మాట్లాడుతూ నిరుపేద కుటుంబాలకు చెందిన 150 పైగా కుటుంబాలు గత కొంత కాలంగా దామచర్ల ఆంజనేయులు కాలనీ నందు నివాసం ఉంటున్నారని అన్నారు. కాలనీ నందు కనీస మౌలిక వసతులు లేక ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. తక్షణమే మౌలిక వసతులు కల్పించి నివాసం ఉంటున్న కుటుంబాలకు శాశ్వత పట్టాలు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో జాతీయ నాయకులు సామ్యూల్, జిల్లా అధ్యక్షులు పల్లెబోయిన మధు యాదవ్, ప్రధాన కార్యదర్శి కోటేశ్వరరావు, పెముల మోజెస్, స్వామిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.







# అర్హులైన లబ్దిదారుల వివరాలను పెండింగ్ లేకుండా ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలి

## జిల్లా జాయింట్ కలెక్టర్ ఆర్ గోపాలకృష్ణ






(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, డిసెంబర్ 8)

ఇంటి నివేశన స్థలాల కోసం వచ్చిన దరఖాస్తులను సమగ్రంగా పరిశీలన చేసి అర్హులైన లబ్దిదారుల వివరాలను పెండింగ్‌లో లేకుండా ఆన్ లైన్ లో అప్ లోడ్ చేయడంతో పాటు ఇంటి పట్టాల రీ వెరిఫికేషన్ ప్రక్రియను పూర్తి చేయాలని జాయింట్ కలెక్టర్ ఆర్ గోపాల క్రిష్ణ తహసిల్దార్లను ఆదేశించారు. సోమవారం సాయంత్రం ఒంగోలు కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి జాయింట్ కలెక్టర్ గోపాలక్రిష్ణ, రెవెన్యూ డివిజనల్ అధికారులు, తహసిల్దార్లతో సమావేశమై హౌసింగ్ ఫర్ ఆల్ కింద ఇంటి నివేశన స్థలాల కోసం వచ్చిన దరఖాస్తుల పరిశీలన, పిజిఆర్ఎస్‌లో రెవెన్యూ అంశాలపై వచ్చిన దరఖాస్తుల పెండేన్సి, ఇంటి పట్టాల రీ వెరిఫికేషన్ ప్రక్రియ, రీ సర్వే పురోగతి, కౌలు, మ్యుటేషన్ తదితర అంశాలపై సమీక్ష నిర్వహించి దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ శ్రీ గోపాల క్రిష్ణ మాట్లాడుతూ, హౌసింగ్ ఫర్ ఆల్ కింద ఇంటి నివేశన స్థలాల కోసం వచ్చిన దరఖాస్తులను సమగ్రంగా పరిశీలన చేసి అర్హులైన లబ్దిదారుల వివరాలను ఆన్ లైన్ లో అప్ లోడ్ చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే ఇంటి పట్టాల రీ వెరిఫికేషన్ పై తహసిల్దార్లు ప్రత్యేక దృష్టి సారించి ఈ ప్రక్రియను పూర్తి చేయాలని జాయింట్ కలెక్టర్ తహసిల్దార్లను ఆదేశించారు. జిల్లాల్లో పిజిఆర్ఎస్‌లో రెవెన్యూ సమస్యలపై వచ్చిన అర్జీలపై ప్రత్యేక దృష్టి సారించి ఆయా దరఖాస్తులను, సమస్యలను పెండింగ్‌లో లేకుండా సకాలంలో పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. రీ ఓపెన్ కేసులపై ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరం ఉందన్నారు. రీ సర్వే పురోగతిపై సమీక్షిస్తూ, నిర్దేసించిన గడువులోపు రీ సర్వే ప్రక్రియను పూర్తి చేసేలా చర్యలు చేపట్టాలన్నారు. ఈ వీడియో సమావేశంలో మార్కాపురం ఇంచార్జి సబ్ కలెక్టర్ శివరామిరెడ్డి, ఎస్‌డిసి మాధురి, డిఎస్ఓ పద్మశ్రీ, ఇతర అధికారులు పాల్గొనగా, క్షేత్ర స్థాయి నుండి రెవెన్యు డివిజనల్ అధికారులు, తహసిల్దార్లు, తదితరులు పాల్గొన్నారు.

# గ్రామకంఠం భూమికి అక్రమ రిజిస్ట్రేషన్



(షణ్ముఖ వెలుగు, తర్లుపాడు, డిసెంబర్ 8)

మండలంలోని కేతగుడిపి గ్రామంలోని సర్వే నెం.46/2లో 16.58 సెంట్ల గ్రామ కంఠం భూమిలోని 92 చదరపు గజాలు అక్రమంగా రిజిస్టర్ అయ్యాయని గ్రామ ప్రజలు ఆరోపించారు. ప్రభుత్వ సర్వేలో ఈ భూమి సంపూర్ణంగా గ్రామ కంఠం భూమిగా నిర్ధారించినప్పటికీ దస్తావేజు నెం.6355/2025 పేరుతో రిజిస్ట్రేషన్ జరగడం చట్టవిరుద్ధమని వారు తెలిపారు. సచివాలయానికి వెళ్లే రోడ్డును ఆక్రమించడం వల్ల ప్రజలకు తీవ్ర ఇబ్బందులు కలుగుతున్నాయని, ఒక షాపులో అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నాయని గ్రామస్థులు తెలిపారు. ఇప్పటికే జిల్లా కలెక్టర్, సబ్ కలెక్టర్, రిజిస్ట్రార్, పంచాయతీ అధికారి, ఎస్పీ తదితర అధికారులకు పలు ఫిర్యాదులు పంపినప్పటికీ చర్యలు తీసుకోలేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామ ప్రజలు అక్రమ రిజిస్ట్రేషన్ రద్దు చేసి, ఆక్రమణలు తొలగించాలని ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

On behalf of PRINTER, PUBLISHER OWNED BY OBULASETTY RADHAKRISHNA DASS AND PRINTED AT HARI PRINTERS AND PUBLICATIONS, FLOT 51, NEAR B.V.SUBBAIAH SCHOOL ROAD, PERNAMITTA, SANTANUTALAPADU (MANDAL), PRAKASAM/ONGOLE (Dt), ANDHRA PRADESH, PIN : 523225. Mobile : 9494177939, RNI : APTEL/2023/89152, e-mail : rkreport9@gmail.com. E-Paper : shanmukhavelugu.com